

విఘ్నాధిపతి..
అయినవిల్లి వినాయకుడు 6

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 27 ఆగస్టు 2025 | 5



గణేశ్ మహోత్సవాలకు సర్వం సిద్ధం

» ఊరూవాడా చవితి పందిర్లు » అధికారుల ఆంక్షలతో నిర్వాహకులు ఉక్కిరిబిక్కిరి » పందిళ్లు, మండపాలకు ఉచిత విద్యుత్ » ఉత్సవాల నిర్వహణలో జాగ్రత్తలు పాటించండి : కలెక్టర్

కోనసీమ అంటేనే ఉత్సవాలకు పెట్టింది పేరు. వినాయక మహోత్సవాలను అంగరంగ వైభవంగా జరపడానికి ఈసారి కూడా సర్వం సిద్ధమైంది. జిల్లాలోని అమలాపురం సహా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చవితి కమిటీల నిర్వహణలో ఘనంగా వేడుకలు నిర్వహించడానికి సకల ఏర్పాట్లు చేశారు. ప్రముఖ అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక దేవస్థానంలో చవితి ఉత్సవాలకు సైతం భారీ ఏర్పాట్లు చేశారు. అయితే ఈసారి అధికారులు అనేక ఆంక్షలు విధించడంతో నిర్వాహకులు కాస్త ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

అమలాపురం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): బుధవారం నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా అధికారులు విధించిన ఆంక్షల చట్రంలో ఉత్సవాలు జరుపుకునేందుకు జిల్లావాసులు సర్వసన్నద్ధమయ్యారు. ఎక్కడికక్కడే భారీగా పందిళ్లు వేసి విద్యుద్దీపాలంకరణలు చేశారు. వినాయక విగ్రహాలను సెంటర్ సెంటర్‌కు పోటీపడి మరీ భారీ విగ్రహాలను ఏర్పాటు చేసుకునే పనిలో నిర్వాహకులు ఉన్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అయినవిల్లిలోని శ్రీవరసిద్ధివినాయక ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం అంగరంగ వైభవంగా ఏర్పాట్లుచేసింది. భక్తులు వేల సంఖ్యలో హాజరు కానున్న దృష్ట్యా అందుకు తగిన రీతిలో క్యూలైన్లు, అన్నప్రసాద వితరణ వంటి ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. ఈ ఉత్సవాలపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ నిషాంతిలు ఇప్పటికే సమీక్షలు కూడా చేసి నిర్వహణా ఏర్పాట్లలో ఎటువంటి వైఫల్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా భద్రతాపరంగా కఠినచర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. వినాయకచవితి ఉత్సవాల నిర్వహణపై పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారులు కఠినమైన ఆంక్షలు విధించడంతో నిర్వాహకులు సైతం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తామని రాష్ట్ర మంత్రి లోకేశ్ చేసిన ప్రకటన నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు కూడా ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు నిమజ్జనాలు సందర్భంగా నిర్వహించే ఊరేగింపుల్లో బాణసంచా, డీజేలను నిషేధించడంతో యువత ఒకింత ఆగ్రహంతో ఉంది. డీజేలు అనుమతించాలంటూ ఆయా పోలీసు అధికారులపై రాజకీయపరమైన ఒత్తిళ్లు ప్రారంభించారు. ఈసారి ఉత్సవాల నిర్వహణ సందర్భంగా మంగళవారం అమలాపురం పట్టణం సహా జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన పత్రి, పండ్లు, పూలు, అరటిపండ్లు వంటి విక్రయాలు వ్యాపారులు ఆశించిన మేర జరగకపోవడంతో ఒకింత నిరాశ, నిస్పృలకు లోనవుతున్నారు. పువ్వుల ధరలు సైతం ఆకాశాన్ని అంటాయి. కిలో రూ.వెయ్యి నుంచి రూ.800 వరకు పలుకుతున్నాయి. ఇక పండ్ల ధరలు అదే రీతిన పెంచి విక్రయిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దు మట్టి విగ్రహాలే ముద్దు అంటూ స్వచ్ఛంద సంస్థలు, కళాశాల వారు, నాయకులు ఇలా ఎవరికి వారు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.



జేసీ నిషాంతికి గణేశ ప్రతిమను అందిస్తున్న జిల్లా కలెక్టర్

ఉత్సవాల నిర్వహణలో జాగ్రత్తలు పాటించండి...

వినాయచవితి ఉత్సవాల నిర్వహణలో జిల్లా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు, భక్తులు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు భద్రతాపరమైన చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మండపాల ఏర్పాటులో అన్ని రకాల సుందరీకరణ పనులు మట్టితోనే నిర్వహించాలని, లైసెన్సు ఉన్న ఎలక్ట్రీషియన్ల ద్వారానే విద్యుద్దీకరణ పనులు చేపట్టాలని, అనధికారికంగా విద్యుత్ లైన్ల నుంచి చౌర్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నందున జాగ్రత్తలు పాటించాలని, నిమజ్జన సమయంలో విగ్రహాల ఊరేగింపులు, శోభాయాత్ర మార్గాలు వంటి విషయంలో విద్యుత్‌శాఖ అధికారులతో సంప్రదించి తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎక్కడా ఎటువంటి వైఫల్యాలు లేకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను ఘనంగా జరిపించేలా చూడాలని కలెక్టర్ కోరారు.

మట్టి ప్రతిమలు పంపిణీ చేసిన కలెక్టర్

గణపతి నవరాత్రులను పురస్కరించుకుని బుధవారం జరిగే వినాయకచవితి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బందికి కలెక్టర్ మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ నిషాంతి, డీఆర్వో మాధవి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. తొలుత కలెక్టర్ జాయింట్ కలెక్టర్ నిషాంతికి వినాయక ప్రతిమను అందజేసి పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు కలెక్టర్, జేసీల నుంచి వినాయక ప్రతిమలు అందుకున్నారు.

తీగ లాగితే.. డ్రగ్స్ లింకులు!



రాష్ట్రంలో ఎక్కడ పట్టుబడినా మూలాలు ఇక్కడే

» గంజాయి, డ్రగ్స్‌కు కేరాఫ్‌గా తూర్పు
» క్లాసుగా తిరుగుతూ దందాలు
» క్లాసులతో సరిపెడుతున్న పోలీస్
» సర్వనాశనమవుతున్న యువత
» పరారీలో డీటీ మణిదీప్..
» బెయిల్‌కి ముందస్తు ప్రయత్నం
» పసిగట్టడంలో నిఘా వైఫల్యం
» మామూళ్ల మత్తులో పోలీస్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఏ మూల మాదక ద్రవ్యాలు దొరికినా మూలాలు తూర్పున కనిపిస్తాయి. ఎక్కడో పట్టుబడిన గంజాయి వాసనకు జిల్లా కేంద్ర బిందువుగా మారుతోంది. చివరికి డ్రగ్స్‌లోనూ అదే తీరు కనిపిస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్ కేసులో కీలక వ్యక్తిగా రాజమహేంద్రవరానికి చెందిన డిప్యూటీ తహశీల్దార్ మణిదీప్ వ్యవహారం మరింత చర్చకు తెరలేపింది. వైసీపీ ప్రభుత్వంలో గంజాయి, డ్రగ్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మూలన చర్యలు ఆరంభించింది. ఈగిల్ టీంను సిద్ధం చేసింది. దీంతో డ్రగ్స్ డొంకలు కదులుతున్నాయి. డిప్యూటీ తహశీల్దార్ డ్రగ్స్ వ్యవహారం కలకలం రేపుతోంది.

కమ్మేస్తున్న గంజాయి పొగ

ఎక్కడ పోలీసులు మాదక ద్రవ్యాలు పట్టుకున్నా ఉమ్మడి తూర్పుగోదావరితో ఏదొక లింకు ఉంటోంది. ఈనెల 16న నెల్లూరు బాలాజీనగర్ పీఎస్ పరిధిలో కారులో గంజాయి తరలిస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం రావడంతో రంగంలోకి దిగారు. కారు డ్రైవరు పోలీసులను ఢీకొట్టి కారుతో పరారయ్యే ప్రయత్నం చేశాడు. వెంబడించిన పోలీసులు రెండు రౌండ్ల కాల్పులు జరిపి ఒక వ్యక్తిని, 22 కిలోల గంజాయిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి రాజమహేంద్రవరానికి చెందిన బీరక ప్రకాశ్ అలియాస్ సూర్యప్రకాశ్ అని గుర్తించారు. ఈనెల 8న ధవళేశ్వరం ఐవో సీఎల్ కాలనీకి చెందిన సతీశ్ అదృశ్యమయ్యాడు. అతనితోపాటు రైళ్లలో సమోసాలు విక్రయించే స్నేహితులు గంజాయి తాగిన మైకంలో చంపేశారు. కుళ్లిన స్థితిలో ఆ యువకుడి శవం లభ్యమైంది. సుమారు రెండేళ్ల కిందట రాజమండ్రికి చెందిన ఓ యాంకర్ హైదరాబాద్‌లోని గంజాయి కేసులో ఆరోపణలు ఎదుర్కొన్నాడు. పోలీసులు ఏమీలేదని తీసి పారేస్తున్నా జరుగుతున్న ఘటనలు నిజమని రుజువు చేస్తున్నాయి. రాజమహేంద్రవరంతోపాటు గ్రామాలకు సైతం గంజాయి పాకేసింది. సిగరెట్లలో పొగాకు తీసేసి అందులోకి నేరుగా గంజాయి నింపి పెద్దఎత్తున విక్రయాలు జరుపుతున్నారు.



చుక్‌చుక్‌లో గప్‌చుప్‌గా

స్టూడెంట్స్ మాదిరిగా బ్యాగులు తగిలించుకొని రైళ్లలో గంజాయి ఆకు, పొడి, లిక్విడ్ రూపాల్లో హైదరాబాద్ పబ్‌లకు సరఫరా చేస్తున్నారు. దీనికి రాజమండ్రి, సామర్లకోట, తుని, అన్నవరం, అనకాపల్లి రైల్వే స్టేషన్లను ఎంచుకుంటున్నారు. విశాఖ వైపు నుంచే వచ్చే బొకారో, కోణార్క్, గువాహటి తదితర రైళ్లు గంజాయి రవాణాకు అనువుగా మారాయని ఇప్పటికే రైల్వే పోలీసులు గుర్తించారు. ఆ రైళ్లలో బోగీలు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటాయి. దీంతో తనిఖీలు చేయడం అసాధ్యం. గంజాయి తీసుకెళ్తున్నవాళ్లు హైదరాబాద్, బెంగళూరు వైపు వెళ్తారు. కొందరు విజయవాడలో దిగిపోయి చెన్నై లేదా చెన్నై వెళ్ల కుండా కాట్పాడి జంక్షన్ మీదుగా నేరుగా వెళ్లే రైళ్లను ఎంచుకొని సేలం, ఈరోడ్‌కు చేరుస్తున్నారు.

నిద్దరోతున్న నిఘా

జిల్లాలోని పోలీస్, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ వంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల్లో నిఘా నిద్దరోతున్నట్టుగా పరిస్థితులు చెబుతున్నాయి. ముఖ్యంగా పోలీస్‌కి సంబంధించి ప్రతి స్టేషన్‌లో ఒక నిఘా విభాగ పోలీస్ ఉంటారు. ఆ పీఎస్ పరిధిలోని అనుమానువులు పసిగట్టి స్పెషల్ బ్రాంచి అధికారులకు తెలియజేస్తే నేరుగా ఎస్పీ చెవికి చేరతాయి. అయితే పోలీస్ నిఘా వృత్తేతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందనే విమర్శలున్నాయి. ఈగిల్ టీం, నిఘా విభాగం ఎవరి దారి వారిదే అన్నట్టుగా ఉన్నాయి. కనీసం నగరాలను ఆనుకొని ఉన్న ప్రాంతాల్లోని రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లలో జరుగుతున్న అసాంఘిక పార్టీలపై కూడా నిఘా ఉండడం లేదంటే.. ఆ పరిస్థితులే మణిదీప్ వంటి వారి దందాలకు ఊతంగా మారాయని చెప్పక తప్పదు. మరోవైపు ఎక్సైజ్ పోలీసులు మద్యం వ్యాపార ప్రక్రియలో బిజీగా ఉంటున్నారు.



హైదరాబాద్‌లో రేవ్ పార్టీలో డ్రగ్స్‌తో పట్టుబడిన యువత (ఫైల్)



స్నేహితులకు మెసేజ్

డీటీ..ఇదేంటి?

ఏపీ నుంచి వెళ్లి డ్రగ్స్‌తో రేవ్ పార్టీ చేసుకుంటున్న ఆరుగురిని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ వింగ్, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రావులపాలెం, ఆలమూరు, రాజమహేంద్రవరానికి చెందిన వాళ్లే.. వీళ్లను పట్టుకుని తీగ లాగితే ధవళేశ్వరం పోలవరం భూసేకరణ పరిపాలనా కార్యాలయంలో చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న మణిదీప్ డొంక కదిలింది. 2012లో కారుణ్య నియామకం కింద రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా జాయినైన మణిదీప్.. ఆర్ఐగా ఉన్న సమయంలో లంచం ఆరోపణలతో సస్పెన్షన్‌కి గురయ్యాడు. అనంతరం డ్రగ్స్ ముఠాలతో పరిచయాలు పెంచుకున్నాడు. ఏడాదికి మూడొంతులు హైదరాబాద్, ఊటీలోనే ఉంటాడు. విలాసవంతమైన పార్టీలను ప్యాకేజ్‌గా ఒప్పుకోవడం ప్రవృత్తిగా చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని రేవ్ పార్టీ పెట్టిన గెస్ట్‌హౌస్ కూడా ఇతనే రాజమహేంద్రవరం నుంచి బుక్ చేశాడని ప్రచారం జరిగింది. అలాగే మణిదీప్ తరచుగా నామవరం రోడ్‌లోని ఓ విలాసవంతమైన రిసార్ట్‌లో పార్టీలు పెట్టేవాడు. రాజానగరం తదితరచోట్ల ఉన్న రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు ఇతడి చేతిలోనే పెట్టుకున్నాడని కూడా చెబుతారు. అలాగే రాజమహేంద్రవరం కేంద్రంగా గంజాయి లోకల్‌గా సమకూరుస్తూ ఖరీదైన డ్రగ్స్ కొకైన్, ఎండీఎంఏ వంటి వాటిని ముంబై, బెంగళూరు నుంచి తీసుకువస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇక రాజమహేంద్రవరం సమీపంలోను, రాజానగరం ప్రాంతంలోను మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలు ఎక్కువ. సుమారు 4 వేల మందిపైనే విద్యార్థులుంటారు. వీరిని లక్ష్యంగా చేసుకుని మధ్యవర్తుల ద్వారా డ్రగ్స్‌ని విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. మణిదీప్ తన రేవ్ పార్టీల సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. మణిదీప్ రకరకాల నిషేధిత డ్రగ్స్‌ని పరిచయం చేసి కుర్రాళ్లను నాశనం చేస్తున్నాడని ఆరోపిస్తూ ఒక వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా ప్రస్తుతం మణిదీప్ పరారీలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ ప్రయత్నిస్తున్నాడని చెబుతున్నారు. తెలంగాణ పోలీసుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే మణిదీప్ వద్దకు వెళ్లిన స్పెషల్ బ్రాంచి పోలీసులు అతడు చెప్పింది విని వెనుదిరగడం ఆరోపణలకు తావిస్తోంది. మణిదీప్‌కి ఎంతటి వారినైనా డబ్బుతో లొంగదీసుకోవడం అలవాటు కాబట్టి ఇప్పుడూ అదే జరిగి ఉంటుందనే విమర్శలున్నాయి. ఈ కేసుతో తనకు సంబంధం లేదంటూ తన స్నేహితులకు మణిదీప్ సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో వాట్సాప్ మెసేజ్ పెట్టడంపై వాళ్లే విస్తుపోతున్నారు.



ఎందుకంత యూరియా!

» యూరియా సరఫరాలో పలు నిబంధనలు
» యూరియా కోసం ఎగబడుతున్న రైతులు
» జిల్లాలో ఇప్పటికే 11,200 టన్నుల వినియోగం
» ప్రైవేటు డీలర్లకు సరఫరా నిలుపుదల
» ఇతర అవసరాలకు వినియోగంపై నిఘా
» జిల్లాలో యూరియా కొరత లేదంటున్న అధికారులు

ఉప్పలగుప్తం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఏదైనా వస్తువు కొరత అన్న మాట విన్పిస్తే చాలు. ఆ వస్తువు కోసం ఎగబడతారు. ఇది సర్వసాధారణం. ఇప్పుడు యూరియా విషయంలో అదే జరుగుతోంది. తెలంగాణలో పేలిన యూరియా బాంబు పొగ మన రాష్ట్రంలో వ్యాపించింది. వ్యవసాయాధికారులకు ఫోన్ చేసి యూరియా కావాలంటూ రైతులు కంగారు పడుతున్నారు. ఇక ముందు యూరియా దొరకదేమో, ముందుగానే తెచ్చుకుని దాచుకుంటే పోలా, ఆర్ఎస్కేలకు వాహనాలతో వచ్చి పదుల సంఖ్యలో యూరియా బస్తాల కోసం డిమాండ్ చేస్తున్నారు. అయితే జిల్లాలో యూరియా కొరత లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో 1.53 లక్షల ఎకరాల సార్వాకు, 1.20 లక్షల ఎకరాల్లో కొబ్బరి తోటలకు, అరటి తదితర ఉద్యానపంటలకు ఈ సీజన్‌కు 16,120 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికే కేంద్రం 14,465 టన్నుల యూరియాను విడుదల చేసింది. దీనిలో 11,200 టన్నుల యూరియా విక్రయం జరిగింది. సాధారణంగా ప్రతి ఏటా సార్వాకు ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు యూరియా సరఫరా జరుగుతుంది. జూలై, ఆగస్టు నెలల్లో ఎక్కువ పరిమాణంలో విడుదల చేస్తారు. వ్యవసాయేతర కార్యకలాపాలకు యూరియాను మళ్లించినపుడు కొరత ఏర్పడుతుందన్న వాదనలు ఉన్నాయి. మిశ్రమ ఎరువుల తయారీలో యూరియాను ఎక్కువ వాడతారు. దీనికోసం పారిశ్రామికవేత్తలు నేరుగా యూరియా ఫ్యాక్టరీల నుంచి సరుకును కొనుగోలు చేసుకుంటారు. అయితే కొందరు రైతుల నుంచి యూరియాను అదనపు ధరలకు కొనుగోలు చేయడం జరుగుతుంది. నిజానికి రూ.1968 ధర ఉన్న యూరియా బస్తాను కేంద్రం కేవలం రూ.267కే రైతులకు అందిస్తోంది. అంటే ప్రతి బస్తాపై రూ.1,701లు రాయితీ. అందుకే రైతుల ముసుగులో కొందరు యూరియాను సేకరించి, లాభాలకు అమ్ముకుంటున్నారని సమాచారం. దీంతో ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసింది. కలెక్టర్ల పర్యవేక్షణలో పోలీసు, విజిలెన్స్, వ్యవసాయం, రెవెన్యూ అధికారుల కమిటీలు రోజూ యూరియా కొనుగోళ్లు, నిల్వలు, వ్యవసాయేతర వినియోగంపై పరిశీలన చేసి నివేదికలు సమర్పిస్తారు. ఇక ఈ ఏడాది యూరియా వినియోగం చాలా పెరిగిందని అధికారులు అంచనా. కొబ్బరి తోటలకు యూరియా వాడతారు. కొన్నేళ్లుగా కొబ్బరి ధరలు అంతంతమాత్రంగా ఉండడంతో చెట్లకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించారు. ఈ ఏడాదిలో కొబ్బరి ధర వెయ్యింటికి రూ.20వేలు దాటడంతో వాటికి యూరియా వాడకం పెంచారు. సార్వా నాట్లు ముంపు నుంచి బయటపడిన వెంటనే పైరును కాపాడుకునేందుకు ఎకరాకు 20 కిలోల యూరియాను వ్యవసాయశాఖ సిఫారసు చేస్తోంది. దీంతో సార్వాలో వినియోగం పెరిగింది. ఉద్యానవన తోటల విషయంలోనూ వినియోగం ఉంది. ప్రస్తుతం కొరత లేకపోయినా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వ్యవసాయాధికారులు యూరియా విడుదలపై నిఘా పెంచారు. విడుదలైన యూరియాను ప్రస్తుతం ఆర్ఎస్కేలు, పీఏసీఎస్‌ల ద్వారా విక్రయాలు చేస్తున్నారు. ప్రైవేటు డీలర్లకు 30 శాతం మాత్రమే ఇచ్చేలా చూడాలని అధికారుల ఆదేశాలు ఉన్నాయి. ప్రస్తుతానికి ప్రైవేటు డీలర్లకు యూరియా విడుదల నిలుపుదల చేసినట్టు సమాచారం. రైతు అవసరాలను పరిశీలించి రెండు లేదా మూడు బస్తాల వరకే యూరియాను ఇస్తున్నట్టు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయం తెలిపింది.



కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లికి చెందిన మత్స్యకారుల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మత్స్యకార ప్రతినిధులు

అల్పపీడనంతో జిల్లాకు భారీ వర్ష సూచన

» టెలీకాన్ఫరెన్సులో పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్
» కంట్రోల్ రూం ఏర్పాటుకు ఆదేశాలు
» ఉప్పాడ కొత్తపల్లి మత్స్యకారుల సమస్య పది రోజుల్లో పరిష్కరిస్తా

అమలాపురం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా డివిజన్ స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. అధికార యంత్రాంగమంతా భారీవర్షాలు, వరదలు వంటి విపత్తులు ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా ఐ.పోలవరం, కాట్రేనికోన, మామిడికుదురు, ముమ్మిడివరంలో ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు కలెక్టర్ తెలిపారు. కొత్తపేట, రామచంద్రపురంలో అన్ని ముంపు ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు ఏర్పాట్లు తీసుకున్నామని తెలిపారు. టెలీకాన్ఫరెన్సులో జేసీ నిషాంతి, డీఆర్వో మాధవితోపాటు వివిధ డివిజన్లు, మండలాలకు చెందిన తహశీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ప్రత్యేక కంట్రోల్‌రూము నంబర్లను కలెక్టర్ ప్రకటించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము నంబరు 08856293104, కొత్తపేట 8500238258, రామచంద్రపురం 08857245166లను సంప్రదించాల్సిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అందరికీ ఆమోద యోగ్యమయ్యేలా..

సముద్ర తీర ప్రాంతంలో చేపల వేట పరిమితులను నిర్ణయించేందుకు పది రోజుల్లో అందరికీ ఆమోద యోగ్యమైన మార్గాన్ని కనుగొంటామని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. మత్స్యకార సమస్యలపై పలువురు ప్రతినిధులతోపాటు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ నేతృత్వంలో ఉప్పాడ కొత్తపల్లి మత్స్యకారులు సముద్ర వేట విషయంలో ఏర్పడ్డ సమస్యలను కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వివరించారు. ఉప్పాడ కొత్తపల్లి మత్స్యకారులకు ఎటువంటి అభ్యంతరం లేకుండా ఎక్కడైనా స్వేచ్ఛగా వేటాడుకునే అవకాశం కల్పించాలని వర్మ నాయకత్వంలో ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. 2014-19లో అప్పటి సీఎం చంద్రబాబు నర్సాపురం వద్ద అంతర్వేది, భీమవరం వద్ద గొల్లపాలెం, వైజాగ్ ప్రాంతాల్లో వేటకు అభ్యంతరాలు కలిగినప్పుడు అక్కడ జిల్లాల ఎస్పీలు, కలెక్టర్లు జోక్యం చేసుకుని చర్చించి వేటకు అవకాశం కల్పించారని, అదే రీతిలో ప్రస్తుతం ఏర్పడ్డ సమస్యలు పరిష్కరించడానికి కలెక్టర్ చొరవ చూపాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ వేట పరిమితిని నిర్దేశించేందుకు మత్స్యకార సంఘాల ప్రతినిధులతో చర్చించి పది రోజుల్లో అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డిగ్రీ విద్యార్థులు ఇండియాస్ స్కిల్ కాంపిటీషన్స్-2025కు సంబంధించి 60 మంది స్కిల్ ట్రేడ్స్‌లో నిర్వహించడం జరుగుతుందని, దీనికి సంబంధించి ఏపీ నైపుణ్య పోర్టల్‌లో సెప్టెంబరు 30లోగా ఆసక్తి ఉన్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జేసీ నిషాంతి

రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి

జేసీని ఆదేశించిన భూపరిపాలన ముఖ్య కమిషనర్

అమలాపురం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): రీసర్వేను నిర్దేశిత దశల్లో పారదర్శకంగా చేపట్టాలని భవిష్యత్తులో ఎటువంటి భూముల వివాదాలు తావులేని డిజిటల్ రికార్డులు రూపొందించాలని జాయింట్ కలెక్టర్ నిషాంతి సర్వే, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మంగళవారం అమరావతి నుంచి భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి వివిధ జిల్లాల జేసీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రీసర్వే పైలెట్ గ్రామాలు, రెండో దశ గ్రామాల్లో పురోగతి నూతనంగా ఏర్పడిన జిల్లాల్లో కోర్టు భవనాలకు భూసేకరణ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, అటవీభూముల సర్వే, సుమోటో కేసుల పరిశీలన, అందరికీ ఇళ్లు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలు పురోగతిలో అధికారులు సర్వే ఆఫ్ ఇండియా వారి సహకారంతో చేపట్టిన రెవెన్యూ రికార్డులను స్వచ్ఛీకరించి భవిష్యత్తు తరాలకు ఎటువంటి వివాదాలు లేని ఆస్తులను అందించాలని సూచించారు. ఈ సమీక్షలో డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, వ్యవసాయాధికారి బోసుబాబు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్ పాల్గొన్నారు.





విఘ్నాధిపతి..అయినవిల్లి వినాయకుడు

అయినవిల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు అయినవిల్లి ముస్తాబైంది. భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.అయినవిల్లి వినాయకుడు విఘ్నాలను తొలగించే స్వామిగా పేరొందారు. వినాయక చవితి.. స్వామికి ఇష్టమైన బుధవారం రావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు దర్శనం కల్పిస్తారు. ఏ కార్యక్రమం తలపెట్టినా ముందుగా అయినవిల్లి వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు లేకుండా పూర్తవుతుందని భక్తుల నమ్మకం.స్థల పురాణం ప్రకారం ఈ క్షేత్రం కాణిపాక వినాయక క్షేత్రం కన్నా పురాతనమైనది. అయినవిల్లిలో స్వర్ణ గణపతి మహాయజ్ఞం జరుగుతుండగా వినాయకుడు ప్రత్యక్షమై అక్కడి వారిని అనుగ్రహించాడని 14వ శతాబ్దంలో శంకరభట్టు రాసిన శ్రీపాదవల్లభ చరిత్రలో ఉంది. ఆ సమయంలో వినాయకుడిని హేళన చేసిన ముగ్గురు మూర్ఖులను వినాయకుడు దండించగా తర్వాత కాలంలో వారే మూగ, చెవిటి, గుడ్డి వారిగా జన్మించి కాణిపాకం వినాయకుడి ఆవిర్భవాన్ని గుర్తించారని స్థల పురాణం చెబుతోంది.

కోర్కెలు తీర్చే.. బిక్కవోలు గణేశుడు..

బిక్కవోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చెవిలో చెబితే చాలు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి కెక్కిన బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం నుంచి నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసారు. తూర్పు చాళుక్యుల కాలంలో 1100 సంవత్సరాల కిందట పంటపొలాల్లో స్వామి స్వయంభూగా వెలిశాడు. బిక్కవోలు వినాయకుడు పదకొండు అడుగుల ఎత్తు, ఆరు అడుగుల వెడల్పుతో దర్శనమిస్తాడు. స్వామి తొండం కుడివైపునకు ఉండడంతో కోర్కెలు చెబితే తప్పక నెరవేరుస్తాడని భక్తుల నమ్మకం. బుధవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా భారీ క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం తెల్లవారుజామున 1.58 గంటలకు స్వామికి అలంకారం చేసిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు గ్రామోత్సవం జరుపుతామన్నారు. ఉదయం 11.04గం.లకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు.



జై జై గణేశా!

జై జై గణేశా.. జైకొడతాం గణేశా అంటున్నారు.. ఊరూవాడా చవితి సందడి వచ్చేసింది.. వినాయక పందిళ్లలో విగ్రహాలను ఏర్పాటు చేశారు.. బుధవారం నుంచి 9 రోజుల పాటు ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని బిక్కవోలు, అయినవిల్లి వినాయక ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చవితి సందర్భంగా చామంతి, మల్లెలు, జాజులు తదితర పువ్వుల ధరలు చుక్కలనంటాయి..



ఐడియా.. అదిరింది!

తాళ్లపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గణేశుడిని ప్రతి రోజూ చూస్తూనే ఉంటారు.. ఎందుకంటే విద్యార్థులు కదా.. చవితికి ఏం చేద్దామా అని ఆలోచించారు.. వినాయకుడి వేషధారణలు.. పూజలు ఓల్డ్.. కొత్తగా ఏదైనా చేద్దామనుకున్నారు.. వినాయకుడి కూర్పుగా తయారైతే ఎలా ఉంటుందా అని ఆలోచించారు.. కాస్త కష్టమే కానీ.. ట్రై చేద్దామని ముందుగా ముగ్గుతో వినాయకుడి ప్రతిమ గీశారు.. ఆ తరువాత ఒక్కొక్కరుగా విద్యార్థులు ఇలా కూర్చుకున్నారు. తీరా చూస్తే వినాయకుడి ప్రతిమ కళ్లకు కట్టినట్టు వచ్చింది.. తాళ్లపూడి మాంటిస్సోరీ పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులు ఇలా వినాయకుడి ఆకృతిని చిత్రీకరించారు.



పువ్వులు.. అధరహో!

- అమాంతంగా పెరిగిన ధరలు
- చామంతులు కేజీ రూ.400
- మల్లెలు..జాజుల ధర టాప్

కడియం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పువ్వుల ధరలు అదిరిపోతున్నాయి. చామంతులు ఒక్కో పువ్వు లెక్కన విక్రయిస్తున్నారు. ఒక్కో పువ్వు రూ.2ల వరకూ ధర పలుకుతోంది. కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్ వినాయక చవితి శోభను సంతరించుకుంది. దీంతో పూల ధరలు ఒక్కసారిగా రెట్టింపు పెరిగాయి. కర్నాటక నుంచి బంతి, తమిళనాడు నుంచి చామంతి పూలను దిగుమతి చేసుకుని వ్యాపారస్తులు విక్రయిస్తుంటారు. మిగిలిన పూలు మన ప్రాంతంలోనే లభిస్తాయి. కడియపులంక పూలమార్కెట్ అటు కొనుగోలుదారులు, వ్యాపారస్థులు, ఇటు రైతులతో కిటకిటలాడింది. వినాయక చవితి సందర్భంగా పూలధరలు ఇలా ఉన్నాయి.

పువ్వుల ధరలు ఇలా ఉన్నాయి..

పూలు	గతంలో	ప్రస్తుతం
చామంతి (కేజీ)	రూ. 300	రూ. 500- 600
మేరీగోల్డ్ చామంతి(కేజీ)	రూ. 200	రూ. 400
నీలం చామంతి (కేజీ)	రూ. 200	రూ. 450
కలకత్తా బంతి (కేజీ)	రూ.60	రూ. 100 - 130
పసుపు బంతి (కేజీ)	రూ. 60	రూ. 199 - 130
లిల్లీ (కేజీ)	రూ. 200	రూ. 400
జాజులు (కేజీ)	రూ.500	రూ. 1,000
మల్లెలు (కేజీ)	రూ. 600	రూ. 1,300
కాగడాలు (కేజీ)	రూ. 600	రూ. 600
స్టార్‌గులాబీ (కేజీ)	రూ. 180	రూ. 300
సెంటుగులాబీ (కేజీ)	రూ.150	రూ. 250
కనకంబరం (బారు-1)	రూ.150	రూ. 200 - 220



గణేశా..తమాషా!

మామిడికుదురు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణేశుడి ఆకారం ఎలాగైనా ఇమిగిపోతోంది.. అందుకే రకరకాలుగా విగ్రహాలు తయారుచేస్తారు..పూజిస్తారు..ఈ చిత్రంలోనే చూస్తున్నారుగా..ఈ విగ్రహం ఏమిటో గుర్తుపట్టారా.. ఏదో మొక్కజొన్న గింజలతో తయారుచేసిన గణేశుడు అనుకుం టున్నారు కదా..కాదు కాదు.. కందిపప్పును అతికించి ఇలా పర్యావరణ గణేశుడిని తయారుచేశారు. మట్టి గణపతిని పూజించండి.. పర్యావరణాన్ని రక్షించండి అంటూ మామిడికుదురు దీప్తి పాఠశాల విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు.పర్యావరణానికి హాని కలగకుండా పీచు, మట్టి, కందిపప్పు, పసుపు, కుంకుమ, పిండి, కూరగాయలు, పండ్లు వంటి పలు రకాలతో వినాయక ప్రతిమలు తయారుచేసి ప్రదర్శించారు. నీటిలో కరిగిపోయే వస్తువులతో గణపతిని తయారుచేసి పూజించాలని విద్యార్థులు అవగాహన కల్పించారు.



మన బుజ్జి గణేశులు

ఆలమూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చిందంటే ఆ సందడే వేరు.. చిన్నారుల నుంచి పెద్దల వరకూ అందరికీ పండగే.. ఈ చిత్రంలోనే చూడండి.. మన బుజ్జి వినాయకులు ఎలా ముస్తాబయ్యారో.. బుధవారం వినాయక చవితి సెలవు కావడంతో పాఠశాలల్లో మంగళవారమే ఉత్సవా లు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో మంగళవారం ఇలా దర్శనమిచ్చారు. స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ముందుగా వినాయక పూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. వినాయక జన్మవృత్తాంతాన్ని ఆయన విద్యార్థులకు వివరించారు.

లౌడీయిజం వద్దు!

కాకినాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గణపతి ఉత్సవాలు వచ్చాయంటే సంబరాలు అంబరాన్నంటుతాయి. వినాయక నిమజ్జనం ఇతర సమయాల్లో భారీ డీజే శబ్దాలతో పందిళ్లలో మోత మోగిస్తారు. డీజేలు నయా ట్రెండ్.. వాటి నుంచి 60 డెసిబుల్స్‌ను మించి శబ్దం వస్తుండడంతో ప్రజలు వివిధ రుగ్మతల బారిన పడుతున్నారు. వినికిడి లోపానికి గురవుతున్నారు. కొన్నిసార్లు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో అమలాపురం పట్టణంలో ఒక యువకుడు డీజే శబ్దాలకు గుండెపోటుకు గురై మృతి చెందాడు. సాధారణంగా మన చెవులు 120-130 డెసిబుల్స్ మాత్రమే భరించగలవు. అంతకు మించితే ప్రమాదమే.60 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఇబ్బందులు ఉండవు. వంద డెసిబుల్స్ దాటితే గుండె జబ్బులు ఉన్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. 110, 120 డెసిబుల్స్ దాటితే విపరీతమైన కోపం, తలనొప్పి వస్తుంది.160 డెసిబుల్స్ దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతుంది. 190 డెసిబుల్స్ దాటితే వినికిడి శక్తి కోల్పోతారు. డీజే బాక్సుల నుంచి వచ్చే వైబ్రేషన్ కారణంగా నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. మెదడుకు రక్తసరఫరా తగ్గి, గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలు మూసుకుపోతాయి. గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. గర్భిణులకు డీజే వైబ్రేషన్స్ ప్రమాదకరమే.అటువంటి ప్రమాదకరమైన డీజేలను నిషేధించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.దీంతో "డీజేలు వద్దు. తీన్మార్‌లు ముద్దు" పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నారు. ఈ సారి పందిళ్లలో డీజేలు ఏర్పాటు చేయవద్దని, తీన్మార్‌లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా పోలీసు అధికారులు సూచిస్తున్నారు.పోలీసుల అనుమతి లేకుండా డీజేలు, బాణసంచా వాడరాదంటూ సూచనలు చేస్తున్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరిపేలా ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటించాలని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు లౌడ్ స్పీకర్లు వాడరాదని, ఇలా పలు నియమనిబంధనలు విధించారు.



ఆవేశంలో మాట్లాడా..క్షమించండి!

మహాసేన రాజేష్

పిఠాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆవేశంలో తాను మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్తున్నట్టు 'మహాసేన' రాజేష్ తెలిపారు. 2020లో కాకినాడ జిల్లా పిఠాపురంతో పాటు పలు చోట్ల విగ్రహాలు, ఆలయాలను ధ్వంసమయ్యాయి. దీనిపై అప్పట్లో హిందూ సంఘాలు, బ్రాహ్మణులు ఆందోళనలు నిర్వహించారు.ఇదే సమయంలో బ్రాహ్మణులను కించపరిచేలా మహాసేన రాజేష్ సోషల్ మీడియాలో మాట్లాడారు.దీనిపై అప్పట్లో బ్రాహ్మణ, హిందూ సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. తదనంతరం పరిణామాల నేపథ్యంలో మంగళవారం పిఠాపురం పాదగయ క్షేత్రానికి వెళ్లిన మహాసేన రాజేష్ బ్రాహ్మణులకు, హిందూ సంఘాలకు క్షమాపణ తెలిపారు.తనకు ఉన్న సమాచారంతో అప్పట్లో మాట్లాడానని, అంతేగానీ ఎవరిపైనా ద్వేషంతో మాట్లాడలేదని చెప్పారు. ఒకరిద్దరి కోసం మాట్లాడిన విషయం సమాజాన్ని బాధపెట్టిందని గుర్తించి, వారు కోరకపోయినా క్షమాపణ చెప్తున్నట్టు తెలిపారు. వారు కేసు విత్‌డ్రా చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో హిందూ, పురోహిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

28 నుంచి జీజీయూలో అంతర్జాతీయ సదస్సు

రాజానగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)లో ఈ నెల 28, 29 తేదీల్లో హరిత ఆర్థిక వ్యవస్థ(గ్రీన్ ఎకానమీ), స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు(సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్-ఎస్‌డీజీఎస్), కృత్రిమ మేధ ఆధారిత హరిత సాంకేతికతలు(ఆల్ ఫర్ గ్రీన్ టెక్నాలజీ)అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు వర్శిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) తెలిపారు. ఇందుకు సంబంధించి వర్శిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రొ వైస్ చాన్సలర్ కేవీబీరాజుతో కలిసి వెల్లడించారు. తైవాన్‌లోని నేషనల్ సన్ యాట్-సెన్ యూనివర్శిటీ భాగస్వామ్యంతో, నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్(ఎన్ఎస్‌టీసీ)తైవాన్ సౌజన్యంతో జరిగే ఈ సదస్సులో పలు రాష్ట్రాల ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో పాటు తైవాన్ నుంచి ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు,నిపుణులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పిఎంఎంఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ 4.0, 5.0 టెక్నాలజీపై అవగాహన సదస్సు

జేఎన్టీయూకే, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని అలూమ్ని ఆడిటోరియంలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్ వీహబ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏఐఎం), నీతిఆయోగ్, మైటీ స్టార్టప్ హబ్ సహకారంతో ఇండస్ట్రీ 4.0, 5.0 సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు, అధ్యాపకులకు ఇంక్యుబేషన్, యాక్సలరేషన్ సహకారం అనే అంశంపై డైరెక్టర్ ఆఫ్ ఇన్నోవేషన్స్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ అధ్యక్షతన అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. అతిథులుగా అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్ వీహబ్ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి జహూరుల్లా ఎస్ఎండీ, జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, అకడమిక్స్ డైరెక్టర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ విచ్చేశారు. జహూరుల్లా తన 17 ఏళ్ల అనుభవాన్ని పంచుకుంటూ డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ ఆవిష్కరణ నమూనాలు, టైడ్ 2.0 ద్వారా వచ్చిన అవకాశాల ప్రాముఖ్యతను వివరించారు. వీసీ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యా సంస్థలు కేవలం బోధన, పరిశోధనా పరిమితులే కాకుండా ఆవిష్కరణ, వినూత్న ఆలోచనల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ప్రామాణికతతో కూడిన పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. సదస్సులో యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీపాదవల్లభునికి

సహస్ర గులాబీ అర్చన

పిఠాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం సహస్ర గులాబీ అర్చన నిర్వహించారు. శ్రీపాదవల్లభుడు, దత్తాత్రేయస్వామి నృసింహసరస్వతులను విశేషంగా అలంకరించారు. శత రుద్రాభిషేకం, సర్వపుష్ప పూజ, సహస్రనామార్చన, మంగళహారతి, వేదపారాయణ, దత్త మూలమంత్ర అనుష్టానము, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొడనూర్-బారౌనికి 26 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లు



సామర్లకోట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పొడనూర్-బారౌని-పొడనూర్ మధ్య రాజమహేంద్రవరం మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు సెప్టెంబరు 6 నుంచి నవంబరు 29 వరకూ 26 వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపనున్నట్టు మంగళవారం ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది. 06055 నెంబరు గల రైలు పొడనూర్-బారౌనిల మధ్య సెప్టెం బరు 6నుంచి నవంబరు 29వరకూ ప్రతీ శని వారం పొడనూర్‌లో ఉదయం 11.50 నిమిషాలకు బయలుదేరనుంది. అలాగే 06056 నెంబరు గల రైలు బారౌని-పొడనూర్‌ల మధ్య సెప్టెంబరు 9 నుంచి డిసెంబరు 2 వరకూ ప్రతీ మంగళవారం బారౌనిలో రాత్రి 11.45 నిమిషాలకు బయలుదేరనుంది.

06055 నెంబరు గల ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు పొడనూర్‌లో ప్రతీ శనివారం ఉదయం 11.50 గంటలకు బయలుదేరుతుంది. పొడనూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పెట్టయ్, కాట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాజమహేంద్రవరానికి ఉదయం 7.20గంటలకు చేరుతుంది. దువ్వాడ, సింహాచలం రోడ్డు, విజయనగరం, బొబ్బిలి, పార్వతీ పురం, రాయగడ, మునిగుడ, టిట్లాగర్, సంబల్ పూర్, రూర్కెలా, నౌవాగాన్, హటియా, రాంచీ, మురి, బొకారోస్టీల్ సిటీ, ధన్‌బాద్, బార్కార్, చిత్తరంజన్, మదుపూర్, జాసిది, జాహజా, కియుల్‌ల మీదుగా బారౌనికి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుతుంది.

06056 నెంబరు గల బారౌనీ-పొడనూరుల మధ్య ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు బారౌనీలో ప్రతీ మంగళవారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరుతుంది. ఈ రైలు రాజమహేంద్రవరానికి బుధవారం ఉదయం 7.30గంటలకు చేరుతుంది. పొడనూరుకు శుక్రవారం తెల్లవారుజామున 3.45 గంటలకు చేరుతుంది. కాగా బారౌనీ-పొడనూరుల మధ్య గల 2,528 కిలోమీటర్ల దూరాన్ని ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 2రోజుల 2గంటల 40 నిమిషాలు ప్రయాణించి గమ్యస్థానాన్ని చేరుతుంది.

ఈ రైలులో సెకండ్ ఏసీ బోగీ ఒకటి, థర్డ్ ఏసీ బోగీలు 3, స్లీపర్ క్లాస్‌బోగీలు, ఎస్ఎల్ఎండీ బోగీలు 2 వెరసి 23 బోగీలతో ప్రయాణించనుంది. ఈ రైళ్లలో వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కెట్ల కోసం సమీప రైల్వే స్టేషన్లలోని బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల్లో కోరారు.

ప్రకృతి సాగును విస్తరించాలి

- పీఎండీఎస్, డ్రమ్ షోయింగ్ పద్ధతులపై దృష్టి సారించాలి
- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



అనపర్తి సావరంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న విజయకుమార్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డెల్టాలోని రైతులు ప్రకృతి వ్యవసాయంలో మెరుగైన పద్ధతులను పాటించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని రైతు సాధికారత సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం బొమ్మూరు కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు మాట్లాడుతూ వ్యవసాయంలో తాము అమలు చేస్తున్న పద్ధతులు, వాటి ప్రభావం, మార్కెటింగ్ విధానాలపై చర్చించారు. పంటల్లో వైవిధ్యం, మల్చింగ్, జీవామృతం వినియోగం ప్రీమాన్సూన్ డ్రై షోయింగ్(పీఎండీఎస్) పద్ధతులను పాటించడం వల్ల వచ్చిన మార్పులను వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కలుపు నియంత్రణకు రసాయన మందులు వాడడం వల్ల ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో కలుపు సమస్య ఎదుర్కోవడానికి మల్చింగ్, సన్నని వరుసల సాగు, డ్రమ్ సీడ్ షోయింగ్ పద్ధతులు ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు తగు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయం రైతుల పెట్టుబడిని తగ్గిస్తూ ఆదాయాన్ని పెంచుతుందని పశువులకు సంవత్సరం పొడవునా పచ్చి మేత లభిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఏపీసీఎంఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అనపర్తి సావరంలో క్షేత్ర సందర్శన

అనపర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఇదిలా ఉండగా విజయకుమార్ అనపర్తి సావరంలో ప్రకృతి సాగు చేపట్టిన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. పంట పొలాలను పరిశీలించి సాగుపై వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా మట్టిలో సారం పెరుగుతుందని, నీటి వినియోగం తగ్గుతుందన్నారు. ఖర్చులు తగ్గడమే కాకుండా ఆరోగ్యాలను కాపాడుకునే వీలు ఏర్పడుతుందనే విషయాలను రైతులకు చేరవేసి ప్రకృతి వ్యవసాయం విస్తరించే విధంగా అధికారులు కృషి చేయాలని విజయకుమార్ పేర్కొన్నారు.

ఉప్పాడ తీరం.. కల్లోలం!

ఎగసిపడుతున్న కెరటాలు

వేట విరమించిన మత్స్యకారులు



కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

కొత్తపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంపై చూపుతోంది. వాతావరణంలో ఏర్పడిన మార్పు లతో తీరం కల్లోలంగా మారి కెరటాలు ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డును తాకుతున్నాయి. దీంతో కొత్తపట్నం- సుబ్బంపేట మధ్య బీచ్‌రోడ్డు కోతకు గురవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. బీచ్‌రోడ్డుకు రక్షణగా ఏర్పాటుచేసిన రాళ్ల కెరటాల ధాటికి సముద్రంలో కొట్టుకుపోతున్నాయి. మయాపట్నం, సూరాడపేట మత్స్యకార ప్రాంతాల్లో కెరటాలు ఇళ్ల ముంగిట్లోకి దూసుకుపోతున్నాయి. మత్స్యకార కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. కెరటాల తీవ్రత అధికంగా ఉండడంతో ఉప్పాడ నుంచి కాకినాడ వాహనాలపై వెళ్లే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రికి సముద్రం మరింత ఉధృతంగా మారే పరిస్థితి ఉండటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ సిబ్బందితో బీచ్‌రోడ్డులో వాహనాల రాక పోకలను నియంత్రించే చర్యలు చేపట్టారు. కాగా అల్పపీడన ప్రభావంతో తీరప్రాం తాలకు చెందిన మత్స్యకారులు స్వచ్ఛందగా వేట విరమించారు.



సుబ్బంపేట వద్ద కోతకు గురైన బీచ్‌రోడ్డు

పొంగి పొర్లుతున్న వాగులు

చింతూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో మళ్లీ ముసురు పట్టింది. మంగళవారం రోజంతా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఎగువనున్న ఛత్తీస్‌గడ్, ఒడిస్సాలో కూడా ఇదే పరిస్థితి ఉండి ఉండడంతో ఆ నీరంతా శబరి, సీలేరు నదుల్లోకి చేరుతోంది. చింతూరు మీదుగా ఛత్తీస్‌గడ్ వెళ్లే 30 నంబరు జాతీయ రహదారిపై తేంగ్‌పాల్, జీదం ఘాట్ తదితర ప్రాంతాల్లో వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. చింతూరు, వరరామచంద్రపురం మండలాల నడుమ జల్లివారిగూడెం వాగు పొంగి ప్రవహిస్తోంది. చింతూరు, భద్రాచలం నడుమ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన పలు కల్వర్టుల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి వాహనదారులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి ఉంది. అదే దశలో చింతూరు మీదుగా ఒడిస్సా వెళ్లే 326 నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు కూడా నత్తనడకన నడుస్తుండడంతో ఆ దిశగా కూడా ప్రయాణం కష్టతరంగా మారింది.



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా తోంగ్ పాల్ సమీపంలో రహదారిపై వరద నీరు



పొంగి ప్రవహిస్తున్న జల్లివారిగూడెం వాగు

అల్లూరి కలెక్టర్, రంప ఐటీడీఏ పీవోకు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి మహిళ మృతి వ్యవహారం

రంపచోడవరం/వై.రామవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి ఓ గిరిజన మహిళ మృతి చెందిన వ్యవహారంలో అల్లూరి జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ప్రసవం కోసం 14 రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలోనే రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఉన్న తన భార్య కాకూరి పార్వతి(26) పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మృతికి కారణమయ్యారని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని అనాథలుగా మిగిలిన తన ఇద్దరు పిల్లలకు న్యాయం చేయాలంటూ వై.రామవరం మండలం జాజిగడ్డకు చెందిన పడాల దుర్గాప్రసాద్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. జూలై 11న కాకూరి పార్వతి ప్రసవ సమయంలో మెరుగైన వైద్యం అందక ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో ఆమెను రాజమండ్రికి తరలించి ఇక్కడి వైద్యులు చేతులు దులుపేసుకున్నారని, గిరిజనులకు అండగా నిలవాల్సిన రంపచోడవరం ఐటీడీఏ కూడా గిరిజన మహిళ నిర్లక్ష్య మృతిపై సరిగా స్పందించలేదని కూడా ఫిర్యాదులో ఆరోపించాడు. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించిన కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులకు నోటీసులు జారీ చేసి అభియోగాలపై తీసుకున్న చర్యల నివేదికను 15రోజుల వ్యవధిలో తమకు సమర్పించాలని కమిషన్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ రెడ్డి ఆదేశించారు. లేకపోతే చట్టపరంగా చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

మనస్తాపంతో రైతు మృతి

దేవదాయశాఖ భూమిలో సాగుచేయరాదని నోటీసు



చంద్రరావు (ఫైల్)

కొత్తపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స లో సీతారామ స్వామికి సర్వే నంబరు 121/122లో 20 ఎకరాల భూమి ఉంది. ఆ భూముల్లో కొమరగిరికి చెందిన సుమారు 40మంది రైతులు ఎంతోకాలంగా సాగుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో దేవుడి కి చెందిన భూముల విషయంలో రైతులు, దేవ దాయశాఖ మధ్య వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. దీంతో ఆ భూముల్లో పలువురు రైతులు తొలకరి సాగు చేపట్టడంతో భూముల విషయం కోర్టులో ఉందని ఎవరూ పంటసాగుచేయరాదని ఇటీవల అధికారులు నోటీసులు జారీ చేశారు. ఐతే కొమరగిరికి చెందిన కండిపల్లి చంద్రరావు (70) సోమవారం దేవదాయశాఖ భూమిలో సాగుచేయడానికి వీలులేదని వీఆర్వో నోటీసుల జారీ చేశారు. ఆ సమయంలో చంద్రరావు మనస్తాపంతో కుప్పకూలి మృతి చెందినట్టు సహచర రైతులు తెలిపారు. చంద్రరావుకు రైతు సంఘం, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

భజనల మాస్టారు నాగేశ్వరరావు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

సామర్లకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భజనల మాస్టారుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పేరొందిన శ్రీ వెంకటేశ్వరా ఆధ్యాత్మిక కళాకారుల సంఘం వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు(85) మాస్టారు చికిత్స పొందుతూ మృతిచెందారు. ప్రభుత్వ పాఠశాలల్లో 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన నాగేశ్వరరావు మాస్టారు పదవీ విరమణ అనంతరం గత రెండున్నర దశాబ్దాలుగా కాకినాడ జిల్లా వేట్లపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకులుగా ఆధ్యాత్మిక సేవలు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాలకు విస్తరింపజేసారు. వేలాది భజన సంఘాలను తయారుచేసి ఆలయాల్లో జరిగే భజనల పోటీల్లో పాల్గొనేలా ఉత్తమ శిక్షణ ఇచ్చారు. ఇటీవల అమరావతిలో టీటీడీ వేంకటేశ్వ రస్వామి ఆలయంలో పెద్దఎత్తున భజనలు నిర్వహించేందుకు అనుమతులు సైతం పొందారు. 10రోజుల కిత్రం వేట్లపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు మాస్టారు గుండెపోటుతో మృతిచెందారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ శ్మశాన వాటికలో నాగేశ్వరావు మాస్టారి అంత్యక్రియలు నిర్వహించారు. భజనసంఘాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు సంతాపం వ్యక్తం చేశారు.

'ఏలేరు'లో పెరుగుతోన్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతోన్నాయి. మెస్తారు వర్షాలు, గోదావరి జలాలు విడుదలతో రిజర్వాయర్‌లో నీరు పెరుగుతోంది. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1050 క్యూసెక్కులు ఏలేరుకు విడుదలవుతున్నాయి. దీంతో ప్రాజెక్టులో 80.01 మీటర్ల స్థాయిలో 13.47 టీఎంసీల నిల్వలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు.



ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
SITES FOR SALE
RAJANAGARAM: DTCP LAYOUT No. LP 36/94 (Adjucenet to Govt Offices with Gated fencing) sites available for sale Cont No: 9533729260
Ajd:244858

4 Lines CLASSIFIED Rs.230/- Only

రైలు ఢీకొని రైల్వే కార్మికుడి మృతి



మృతిచెందిన సత్యనారాయణ

సామర్లకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి కాకినాడ-విశాఖ బైపాస్ రైల్వే ట్రాక్‌పై విధి నిర్వహణలో ఉన్న సామర్లకోటకు చెందిన బంకపల్లి సత్యనారాయణ (44) అనే రైల్వే కార్మికుడిని మంగళవారం వేగంగా వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సామర్లకోట రైల్వే ఎస్ఎస్ ఎం.రమేష్ అందించిన సమాచారం మేరకు...పిఠాపురం రైల్వే సెక్షన్‌లో పనిచేస్తున్న సత్యనారాయణ ట్రాక్‌పై విధుల నిర్వహణలో వెనుక నుంచి రైలు రావడాన్ని గుర్తించలేకపోవడంతో ప్రమాదం సంభవించినట్టు రైల్వే పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు.

యూరియా... అగచాట్లు ఏంటయ్యా!

వర్షంలోనే గొల్లప్రోలు సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు



గొల్లప్రోలు సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు



గొల్లప్రోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పడం లేదు. ఇటీవల భారీ వర్షాలు, వరదల అనంతరం యూరియాకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. ముంపునకు గురైన పొలాల్లో బూస్టర్ డోస్‌గా యూరియా వేయాలన్న వ్యవసాయశాఖ సూచనలు, అదే సమయంలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతుండడంతో ఎరువు వేయాల్సిన అవసరం ఏర్పడింది. కొద్ది రోజులుగా యూరియా ప్రవేటు దుకాణాల్లో అందుబాటులో లేకపోవడంతో సొసైటీలు, రైతు సేవా కేంద్రాలపైనే రైతులు ఆధారపడుతున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు సొసైటీ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. దీంతో సోమవారం రాత్రి 20 టన్నులు, మంగళవారం ఉదయమే మరో 20 టన్నుల యూరియాను గొల్లప్రోలు సొసైటీకి పంపారు. యూరియా వచ్చిందన్న సమాచారంతో రైతులు తెల్లవారుజాము నుంచే సొసైటీ వద్ద బారులు తీరారు. సుమారు అరకిలోమీటరు మేర రైతులు క్యూలో నిలుచున్నారు. రైతుకు రెండు బస్తాలు వంతున పంపిణీ చేశారు. వర్షం పడుతున్నా లెక్కచేయకుండా రైతులు బారులు తీరడం గమనార్హం. యూరియాకు ఎటువంటి కొరత లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. గొల్లప్రోలు సొసైటీ వద్ద రైతులు బారులు తీరిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఇక్కడకు చేరుకుని దగ్గరుండి రైతులకు యూరియా పంపిణీ చేయించారు. వర్మ వెంట టీడీపీ గొల్లప్రోలు పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పేలిన గ్యాస్ బండ

పరుగులు తీసిన జనం

మురమళ్ళలో తప్పిన పెను ప్రమాదం

ఐ.పోలవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ 216 జాతీయ రహదారిని ఆనుకుని మాణిక్యాంబా అమ్మవారి ఆలయం వద్ద సోమవారం రాత్రి గ్యాస్ బండ పేలడంతో జనం భయంతో పరుగులు తీశారు. రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదం జరగడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఐ.పోలవరానికి చెందిన బొలిశెట్టి సత్యశ్రీనివాస్ మాణిక్యాంబ గుడి సెంటర్‌లో మిర్చి బండి వ్యాపారం చేసుకుంటున్నాడు. సోమవారం రాత్రి ఎప్పటి మాదిరిగానే రాత్రి 9.30 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దుకాణంలోని గ్యాస్ బండ పేలి రోడ్డుపైకి ఎగిరిపడింది. భారీ శబ్దంతో పాటు రహదారిపై మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు, స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఎస్ఐ రవీంద్రబాబు, ముమ్మిడివరం అగ్నిమాపక దళం సంఘటనా స్థలికి చేరుకుని మంటలు నియంత్రించారు. ఈ ప్రమాదంలో మిర్చి బండితో పాటు ఒక జోళ్ళ షాపు దగ్ధమైంది.





గ్యాస్‌బండ పేలుడుతో సంభవించిన మంటలు, దగ్ధమైన దుకాణాలు

ఆ కట్టడం అన్నవరానిదే..!

కొండను ఆనుకుని ఉన్న ప్రైవేట్ నిర్మాణం

దేవదాయశాఖ, ఇరిగేషన్ శాఖల మధ్య పంచాయితీపై సర్వేలో వెల్లడి



దేవస్థానం, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్న సర్వే

అన్నవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం కొండను ఆనుకుని ఉన్న ప్రైవేట్ నిర్మాణం విషయంలో దేవదాయశాఖ, ఇరిగేషన్ శాఖల మధ్య వివాదంపై మంగళవారం సర్వే నిర్వహించగా వివాదాస్పద కట్టడం దేవస్థానం పరిధిలోనిదేనని రెవిన్యూ, సర్వే అధికారులు తేల్చిచెప్పినట్టు దేవస్థానం అధికారులు వెల్లడించారు. గత 15 ఏళ్లుగా ఈ నిర్మాణంపై వివాదం చెలరేగుతూనే ఉన్నా సర్వే అధికారులు సర్వే చేపట్టి ఏమీ తేల్చకుండా ఉండడంతో తరచూ దీనిపై రాద్ధాంతం జరుగుతూనే ఉంది. ఈ స్థలం ఇరిగేషన్ పరిధిలోనిదే అంటూ ఇరిగేషన్ అధికారులు, దేవస్థానం పరిధిలోనిదే అని అన్నవరం దేవస్థానం అధికారులు పేర్కొంటున్నా కొలిక్కిరాలేదు. దీనిపై జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో ల్యాండ్ సర్వే ఏడీఈ ఆధ్వర్యంలో పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పర్యవేక్షణలో సర్వే చేశారు. పంపా రిజర్వాయిర్ గట్టును ఆనుకుని లోపలకి సుమారు 70 అడుగులు దేవస్థానానికి చెందినట్టు అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు. దీంతో నిర్మాణమంతా దేవస్థానం పరిధిలోకి వస్తుందని ఈఈ తెలిపారు. ఈ సమయంలో వివాదాస్పద కట్టడం యజమాని హరిగోపాల్ దీనిపై స్టే ఉందని తెలపడంతో ఆర్డీవో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది 2 శాఖల మధ్య వివాదమని థర్డ్‌పార్టీ ప్రమేయం ఉండకూడదని హెచ్చరించారు. సర్వేలో దేవస్థానం ఈవో సుబ్బారావు, ఈఈ రామకృష్ణ, లీజుల విభాగం అధికారులు, ఇరిగేషన్ ఈఈ శేషగిరి తదితరులున్నారు. దీనికి సంబంధించి కాగితాలు ఆర్డీవో కార్యాలయానికి తీసుకురావాలని సూచించారు. అయితే అన్నవరం దేవస్థానానికి చెందిన స్థలమేనని ప్రాథమిక నిర్ధారణకు రావడంతో ఈసారైనా దీనిని దేవస్థానం స్వాధీనం చేసుకుంటుందో లేదో వేచిచూడాలి.

పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరనే ఆందోళనతో..

యువకుడి ఆత్మహత్య

కలుపుమందు తాగిన వైనం

సీతానగరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం సింగవరం గ్రామానికి చెందిన బిట్ర సూరిబాబు (24) కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల ప్రకారం.. సూరిబాబు రాజమహేంద్రవరం ఆసుపత్రిలో వరి బీజం ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆందోళనగా ఉంటున్నాడు. ఆ ఆపరేషన్ వల్ల పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరనే ఆందోళనతో మానసిక వేదనకు గురై సోమవారం సాయంత్రం గ్రామంలోని పామాయిల్‌తోటలోకి వెళ్లి కలుపుమందు తాగాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానని, కలుపుమందు తాగేశానని కోట సతీష్ అనే వ్యక్తికి చెప్పగా అతడు ఉప్పల దుర్గాప్రసాద్‌కు చెప్పాడు. అతడు విషయాన్ని సూరిబాబు కుటుంబ సభ్యులకు చేరవేశాడు. దీంతో బంధువులు, స్నేహితులు పామాయిల్ తోటకు వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న సూరిబాబును సీతానగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. ఈ మేరకు సూరిబాబు తండ్రి బిట్ర శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

పంటకాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

అనుమానాస్పద మృతిగా కేసు



మరణించిన చిన్న (ఫైల్)

కొత్తపేట/అంబాజీపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముక్కామల- ఈదరపల్లి పంట కాలువలో వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని కొర్లపాటివారిపాలానికి చెందిన మేడిది రంగాజానకీ ప్రసాద్(చిన్న) (55) సోమవారం రాత్రి కొత్తపేట మండలం గొలకోటివారిపాలెం ప్రధాన పంటకాలువలో గల్లంతయ్యాడు. మృతదేహం పాలగుమ్మి బల్లకట్టురేవు వద్ద మంగళవారం సాయంత్రం లభ్యమైంది. దీనిపై అతడి సోదరుడు మేడిది శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొర్లపాటివారిపాలెంలో విషాదఛాయలు

అందరితో కలిసిమెలిసి ఉండే మేడిది రంగాజానకీప్రసాద్ (చిన్న) మృతితో కొర్లపాటివారిపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంబాజీపేట పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్‌గా, కొబ్బరి వ్యాపారి, టీడీపీలో క్రియాశీలక సభ్యుడిగా చిన్న పనిచేశారు. అంతేకాకుండా కొర్లపాటివారిపాలెంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. మృతుడు చిన్నకు భార్య పావనిరాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాడు. చిన్న మృతికి టీడీపీ నాయకులతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఆబోతుల పోట్లాట.. గాయపడ్డ వ్యక్తి మృతి

అల్లవరం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుండెపూడి ఆంజనేయస్వామి గుడి వద్ద ఆబోతులు పొట్లాడుకుంటుండగా పక్కనున్న జంగా రామకృష్ణపై(41) అవి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని గ్రామస్తులు తెలిపారు. రామకృష్ణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపు 'నిధి ఆప్‌కే నికత్'

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో రీజనల్ కార్యాలయం పరిధిలో గురువారం నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఎంప్లాయర్ అవేర్‌నెస్ థీమ్‌తో నిర్వహిస్తున్నామని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి కాతేరులోని తిరుమల స్కూల్, కోనసీమ జిల్లా-తాళరేవు మండలంలోని సుంకర పాలెంలో ఉన్న రవి జూనియర్ కళాశాల, కాకినాడ జిల్లా-అన్నవరం దేవస్థానం, పశ్చిమ గోదావరి జిల్లా- భీమవరం జగదీశ్ మెరైన్, ఏలూరు జిల్లా- వంగూరులోని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి రంపచోడవరంలోని లెనోరాలో నిధి ఆప్‌కే నికత్ జరుగుతుందన్నారు. సభ్యులకు ఈసీఆర్, రిటర్నులపై అవగాహన, కేవైసీ, సభ్యుల వివరాలను సరిచేయడం, డిజిటల్ సిగ్నేచర్ వంటి సేవలు ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్య

తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలింపు

కేసు నమోదు

రావులపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్యపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన మట్టా ఎంజాలీనాజనీఫర్ తామస్ భర్త మట్టా శ్రీనివాస్‌తో నివసిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతీ రోజు తాగి వచ్చి వేధింపులకు గురి చేస్తుండడంతో ఈనెల 25న అర్ధరాత్రి నిద్రిస్తున్న భర్తపై అప్పటికే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌ను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమణరెడ్డి తెలిపారు.

స్కూటీ తాళం బద్దలు కొట్టి రూ.1.60 లక్షలు చోరీ

పిఠాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద స్కూటీ డిక్కీ తాళాలు బద్దలు కొట్టి నగదు చోరీ సంఘటన సంచలనం కలిగించింది. పిఠాపురం మండలం గోకివాడ మాజీ సర్పంచ్ బిళ్లకుర్తి రాంబాబు కుమారుడు నాగబాబు సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని బ్యాంకుకు వెళ్లి రూ.1.60 లక్షలు డ్రా చేశాడు. ఆ నగదును స్కూటర్ డిక్కీలో పెట్టి తాళం వేసి పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో తన బంధువు మరణ ధృవీకరణపత్రం కోసం వెళ్లాడు. కార్యాలయం లోపలకు వెళ్లి తిరిగి వచ్చి చూసుకునేసరికి స్కూటీ డిక్కీ తాళాలు బద్దలు కొట్టి తెరిచి ఉండటాన్ని గమనించాడు. లోపల ఉన్న నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని సీసీ కమెరాలు పరిశీలించగా పనిచేయడం లేదని తేలింది. దీంతో బ్యాంకు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ గల సీసీ కెమేరాలను పరిశీలన చేస్తున్నారు. నాగబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

గొల్లప్రోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో వాటర్ ట్యాంకర్ బోల్తాపడింది. పట్టణంలోని జగనన్నకాలనీకి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మంగళవారం కాలనీకి వెళ్లిన ట్యాంకరు అదుపుతప్పి బోల్తాపడింది. ట్యాంకరుపై ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో బోల్తా పడిన ట్యాంకర్‌ను పైకి లేపి తిరిగి యథావిధిగా తాగునీటి సరఫరాను కొనసాగించారు.



గొల్లప్రోలులో బోల్తాపడిన ట్యాంకర్

మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

యానాం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో బకాయిలు జీతాలు చెల్లించాలని యానాం మున్సిపల్ ఉద్యోగులు చేస్తోన్న ఆందోళన మంగళవారం కొనసాగింది. వేతనాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పండగలు వస్తున్నాయి జీతాలు ఇవ్వకపోతే బతికేదెలా అని ప్రశ్నించారు.

మట్టి గణపతే మహాగణపతి

- పర్యావరణ పరిరక్షణకు జిల్లాలో పలు చోట్ల ఉచితంగా మట్టి గణనాథుల పంపిణీ







పి.గన్నవరంలో మట్టి గణనాథుడిని అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న పవన్‌కుమార్, అల్లవరంలో డీఎస్పీ ప్రసాద్ సమక్షంలో ప్రజలకు మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతే మహాగణపతి అంటూ అమలాపురం భాష్యం స్కూలులో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. జోనల్ ఇన్‌చార్జి జవ్వాది వెంకటశ్రీనివాస్ విద్యార్థులచే గణపతి మట్టి ప్రతిమలను తయారు చేయించారు. రంగులు, రసాయనాలు వినియోగించకుండా మట్టి గణపతితే ప్రతీ ఇంటా పూజించే విధంగా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. అనంతరం గణపతి ఆవిర్భావంపై విద్యార్థుల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. గణపతి పుట్టుకకు సంబంధించిన ప్రదర్శనలో విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, చాంప్స్ ఇన్‌చార్జి నాగశ్రీ, జె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నల్లా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వినాయక ప్రతిమల పంపిణీ

నల్లా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం వెండి, బంగారు వర్తక సంఘం షరాబుల పందిరిలో ట్రస్టు అధ్యక్షుడు నల్లా పవన్‌కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను వందలాదిగా పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, మోటారు సైకిళ్లపై వెళుతున్న వారితో పాటు రోడ్డుపై ప్రయాణించే ప్రతీ ఒక్కరికీ మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోకరకొండ నాగేంద్ర, అరిగెల నాని, మేడిచర్ల త్రిమూర్తులు, వలవల శివరావు, నూకల సత్యనారాయణ, పేరి లక్ష్మీనరసింహం, నాగ నవీన్, పెదమల్లు మణికంఠ, నల్లా దుర్గారావు, గోకరకొండ గంగన్నస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం (ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. అల్లవరం పోలీసుస్టేషన్ వద్ద సాయిబాలాజీ ట్రస్టు వ్యవస్థాపకుడు, టీడీపీ సీనియర్ నేత బండిగుప్తాపు పాండురంగ ఆధ్వర్యంలో ఆయన మంగళవారం వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అల్లవరం ఎస్ఐ డి.సంపత్‌కుమార్, సహకార సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి గోపి, కంకిపాటి వీరబాబు, బండిగుప్తాపు చిట్టివెంకన్న, మెరికల నాగేశ్వరరావు, దాసం రాంబాబు, బండిగుప్తాపు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మట్టిగణపతిని పూజించండి.. పర్యావరణాన్ని రక్షించండి అంటూ ఈదరాడ స్కూలు విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలు తయారుచేసి ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. మట్టి విగ్రహాలతోపర్యావరణం పాడవకుండా ఉంటుందన్నారు. మామిడికుదురు దీప్తి పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను ప్రదర్శించారు. పీచు, మట్టి, కందిపప్పు, పసుపు, కుంకుమ, పిండి, కూరగాయలు, పండ్లు వంటి పలు రకాలతో తయారు చేసిన వినాయక ప్రతిమల ప్రదర్శన ఆకట్టుకుంది.

ముమ్మిడివరం,(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 4వ వార్డులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో వినాయకచవితి సందర్భంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. జనసైనికుడు వి.రవితేజ ఆధ్వర్యంలో 4వ వార్డులో ఇంటింటికీ మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): వినాయచవితి సందర్భంగా మట్టి విగ్రహాలనే వాడాలని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వివేకానంద పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమలను విద్యార్థులకు అందజేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ కాకినాడ సహాయ పర్యావరణ ఇంజనీర్ ఫణిత అన్నారు. మంగళవారం ముక్తేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను ఇంజనీర్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామంలో మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు పొట్టా నాగేశ్వరరావు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీటీసీ బైరా నాగరాజు చేతులమీదుగా గ్రామంలో చాలామందికి అందించినట్టు ఆయన తెలిపారు. అంతర్వేది దేవస్థానం స్కూలు విద్యార్థులు మట్టి బొజ్జ గణపయ్యలను తయారుచేసి ఇంటికి తీసుకువెళ్లినట్టు ప్రధానోపాధ్యాయురాలు పి.నాగశ్రీవిద్య తెలిపారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్, సీహెచ్ భారతి పాల్గొన్నారు.

కాట్రేనికోన,(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనలో తేజస్వినీ జ్యోతిషాలయం వేదికగా ఫ్రెండ్లీక్లబ్ వ్యవస్థాపకుడు ఆకొండి నాగరవీంద్రజోగయ్యశాస్త్రి ఆధ్వర్యంలో 800మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.గ్రంధి నానాజీ, తాతపూడి బుల్లి, సుంకర పవిత్రకుమార్, ఆకొండి ఉమామహేష్, శ్రీకాంత్, అల్లవరపు సత్యనారాయణ, వింజమూరి శ్రీనివాస్, మల్లాడి సత్యవతి, ఆణివిళ్ళ ఫణికాంత్‌శర్మ, ఆకొండి అంజి,కిరణ్‌శర్మ, ఆకొండి సూర్యకాంతం, ఆకొండిలీలపాల్గొన్నారు.

ఐ.పోలవరం,(ఆంధ్రజ్యోతి): గుత్తెనదీవి సాయిరాం స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు తయారుచేసిన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కాలుష్య నివారణకు మట్టి ప్రతిమలనే వాడాలని కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాగాపు సీతారత్నం, నాటి ధనరాజు, గల్లా భూలక్ష్మీదేవి, కె.నాగదివ్య, ఎన్.దేవకి, ఎ.ప్రత్యూష, ఎ.శిరీష, డి.వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): వినాయక చతుర్థి ఉత్సవాల సందర్భంగా మట్టితో చేసిన గణపతి ప్రతిమలను వినియోగించడం ద్వారా కాలుష్య నివారణకు అందరూ సహకరించాలని గొల్లవిల్లి హైస్కూల్ హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించి, ఉచితంగా భక్తులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.భీమనపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. సీఈవో పోలిశెట్టి దుర్గాప్రసాద్, టీడీపీ నాయకుడు ఆకేటి బాబులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని కాపాడండి: ఎమ్మెల్యే

పి.గన్నవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మట్టి గణనాథులను పూజించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో మంగళవారం ఆయన స్థానికులు, ప్రయాణికులకు మట్టి వినాయకుని ప్రతిమలను అందించి అనంతరం మాట్లాడారు. మట్టితో విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని భక్తులను ఆయన కోరారు. కార్యక్రమంలో సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, కె.సత్యనారాయణరాజు, పితాని రాంబాబు, కోట రాజేంద్ర, తాటికాయల శ్రీనివాసరావు, షేక్ దొరబాబు, తాటికాయల వెంకటేష్, కర్రి బాబూరావు, తానంకి నాగరాజు పాల్గొన్నారు.

నవరాత్రులకు ముస్తాబైన లక్ష్మీగణపతి

అమలాపురం టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం భూపయ్య అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీగణపతి స్వామివారు వినాయకచవితి ఉత్సవాలకు ముస్తాబయ్యారు. నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విద్యుద్దీపాలు ఏర్పాటుచేశారు. నవరాత్రి దీక్షా మహోత్సవం పేరిట భక్తులకు ఆహ్వానపత్రాలు పంపిణీ చేశారు. బుధవారం ఉదయం 7.05గంటల నుంచి గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ చైర్మన్ పేరి కొండబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.







మామిడికుదురు: ఈదరాడలో మట్టితోచేసిన వినాయకుడితో ఈదరాడ విద్యార్థులు, అమలాపురం: భాష్యం స్కూలులో మట్టి గణపతే మహాగణపతి అంటున్న విద్యార్థులు, భూపయ్య అగ్రహారంలో లక్ష్మీగణపతి

గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



అమలాపురంలో బిజీగా మారిన మార్కెట్

అయినవిల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక దేవస్థానంలో చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని పువ్వులతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లుఏర్పాటుచేశారు. బుధవారం ఉదయం 3.45గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. శైవగమోక్త ప్రధానార్చకులు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో వినాయకచవితి సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పండ్ల రసాలతో రుద్రాభిషేకం, లక్ష దుర్వార్చన, గణపతి కల్పం, శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నట్టు సహాయ కమిషనర్ అల్లు దుర్గాభవానీ తెలిపారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లుపూర్తి చేశారు. గణపతి ఆలయాల వద్ద గ్రామాల్లోని నాలుగు వీధుల కూడళ్లలో పెద్దపెద్ద పందిళ్లు వేసి రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరింపచేశారు. ఉత్సవ విగ్రహాన్ని నిలిపేందుకు మండపాలు సిద్ధం చేశారు. దీంతో గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల శోభ నెలకొంది. ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో లక్ష్మీగణపతి, బళ్లగేటు సెంటర్‌లో త్రిముఖ గణపతి, పోలీసుస్టేషన్, కొండాలమ్మచింత, మార్కెట్ సెంటర్లతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వినాయచవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవ విగ్రహాలను కూడా తీసుకువచ్చి అక్కడ సిద్ధం చేశారు.

పూజా సామగ్రి విక్రయ స్టాల్స్..

వినాయకచవితి సందర్భంగా చవితి పూజా సామగ్రి విక్రయ స్టాల్స్‌ను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం మార్కెట్ సెంటర్, బళ్లగేటు సెంటర్, శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపం సెంటర్లలో పూజా సామగ్రి విక్రయ స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. వర్షం పడుతున్నా భక్తులు లెక్క చేయకుండా పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. దీంతో పూజా సామగ్రి కొనుగోలు చేసే వారితో రోడ్లు కిటకిటలాడాయి.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రి మహోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. కూనవరంలో కర్షక గణపతి నవరాత్రి ఉత్సవాల్లో జానపద సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. గొల్లవిల్లిలో యువత ఆధ్వర్యంలో సిద్ధివినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఉప్పలగుప్తం, చల్లపల్లి, భీమనపల్లి, విలసవిల్లి, ఎస్.యానాం, సన్నవిల్లి, గోపవరం తదితర గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయాలు, ప్రత్యేక వేదికలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. 9రోజులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గణపతి హోమపూజలు, భారీ అన్నసమారాధనలు జరగనున్నాయి.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో గణపతి నవరాత్రుల్లో భాగంగా వినాయకుని ఆలయాలు, మండపాలు వద్ద నవరాత్రుల ఏర్పాట్లను చేశారు. సఖినేటిపల్లి, సఖినేటిపల్లింక, రామేశ్వరం, గొంది, గుడిమూల, అంతర్వేది దేవస్థానం, అంతర్వేది, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు, వీవీమెరకతదితర గ్రామాల్లో మండలపాల వద్ద విగ్రహాలను ఏర్పాటు చేసి, విద్యుద్దీపాలతో అలంకరించారు. నవరాత్రుల్లో భాగంగా ఆలయాల వద్ద, మండపాలవద్ద భజన కాలక్షేపాలతో సందడి నెలకొంది.

ప్రజలకు నష్టపరిహారం అందించాలి

యానాం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): సముద్రంలో ఆయిల్, గ్యాస్ వెలికితీస్తున్న చమురుసంస్థల నుంచి ప్రజలకు రక్షణతో పాటు నష్టపరిహారం అందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. మంగళవారం కాకినాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా సముద్రం నుంచి యానాంలోని ఐలాండ్ నెంబరు 3మీదుగా వెళ్లిన గ్యాస్ పైప్‌లైన్ లీక్‌కు సంబంధించి జరిగిన ప్రమాదంపై కలెక్టర్‌కు వివరించారు. స్థానిక మత్స్యకారులు, ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారని వివరించారు. 8అంశాలకు సంబంధించి ప్రభుత్వం, చమురుసంస్థలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. చమురు సంస్థలు, ప్రజాప్రతినిధులు, మత్స్యకార ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, ఎమ్మెల్యే కొండబాబు

కంపెనీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో త్వరలో సమావేశం: కలెక్టర్

మూడు రోజుల్లో కంపెనీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సమావేశంలో ప్రస్తుతం జరిగిన సంఘటన, జరుగుతున్న పనులపై చర్చించి, భవిష్యత్‌లో ఏవిధంగా ముందుకు వెళ్లాలనే అంశాలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

మత్స్యకారులకు న్యాయం చేస్తా

ముమ్మిడివరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలం భైరవపాలెం వద్ద గ్యాస్ పైపులైను లీకవడంతో సంభవించిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి మత్స్యకారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లి పెద్దిరాజు పేర్కొన్నారు. గ్యాస్ పైపలైన్ లీకైన దరియాలతిప్ప, గాడిమొగ, సావిత్రీనగర్, భైరవపాలెం తదితర తీర ప్రాంతాల్లో పెద్దిరాజు పర్యటించి అనంతరం ముమ్మిడివరంలో విలేకరులతో మాట్లాడారు. గ్యాస్ పైపులైను లీకవ్వడం వల్ల జరిగిన నష్టంపై మత్స్యకారులను ప్రమాద వివరాలను, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. గోదావరి నదీపాయల వెంబడి 30నుంచి 40కిలోమీటర్ల తీరం వెంబడి మత్స్యసంపద చేప, రొయ్య, పీత, ఇంగిలాయి వంటి వాటికి నష్టం జరిగిందని, భవిష్యత్తులో కూడా మత్స్యసంపద తమకు లభించదని అయా ప్రాంతాల మత్స్యకారులు తనకు వివరించినట్టు పెద్దిరాజు పేర్కొన్నారు. మత్స్యకారులకు జరిగిన నష్టం తదితర విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని పెద్దిరాజు పేర్కొన్నారు. ఆయన వెంట కొల్లి వీరబాబు, కామాడి మాతరాజు, మల్లాడి నరసింహమూర్తి, సంగాడి కామేశ్వరరావు, మల్లాడి ఈశ్వర్, కోలా రమేష్, బలసాడి గంగాధర్, లంకే అంజి ఉన్నారు.



ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి : ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలో ఓఎన్జీసీ ఏర్పాటుచేసిన రోడ్ల వల్ల ముంపునకు గురవుతున్న పంటపొలాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. స్థానిక రైతులు ఎమ్మెల్యేకు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఏటా మూడు పంటలు కోల్పోతున్నామని, కొబ్బరి రేట్లు ఎందుకు పనికిరాకుండా పోయాయని, వాటికి నష్టపరిహారం ఇచ్చేలా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓఎన్జీసీకి చెందిన అసెట్ సపోర్టు మేనేజర్ ఏకే రాజుతో మాట్లాడుతూ పంట పొలాల్లో చేరుతున్న ముంపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలని ఆదేశించారు. రైతులు కోరిన విధంగా మూడు పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులతో చర్చించి ముంపునీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చారు. కోలా సత్తిబాబు, పితాని వెంకటేశ్వరరావు, బోనం బాబు, తుండూరి బుజ్జి, కేఎం రజా, రాయపురెడ్డి శ్రీనివాసరావు, నగరం ఓఎన్జీసీ రెసిడెంట్ ఇంజనీర్ రుషికేష్‌రెడ్డి పాల్గొన్నారు.

భరతనాట్య కళాకారిణి సంస్కృతికి అభినందనలు

అమలాపురం టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోన్న గొలకోటి సంస్కృతి భరతనాట్య ప్రదర్శనల్లో ప్రముఖుల ప్రశంసలు అందుకోవడంతో మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతి, బిర్లా ఆడిటోరియంలో నిర్వహించిన ప్రదర్శనల్లో సంస్కృతి తన ప్రతిభను చాటి కళాభిమానులను ఆకట్టుకుంది. సంస్కృతికి దుశ్శాలువాలు కప్పి మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కౌన్సిలర్ పిండి అమరావతి, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గా, పీఎంసీ చైర్మన్ మలిశెట్టి వీరాస్వామి, పాఠశాల హెచ్ఎం కాశి ఘనసత్యనారాయణ, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, కేఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసా జయంతి

అమలాపురం టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మదర్‌థెరిసా జయంతిని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో అమలాపురంలో మదర్‌థెరిసాకు పలువురు నివాళులర్పించారు.వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గోకరకొండ నాగేంద్ర, పేరి లక్ష్మీనరసింహం, నల్లా పవన్‌కుమార్, కుడుపూడి త్రినాథ్, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మేడిచర్ల త్రిమూర్తులు, నూకల సత్యనారాయణ, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

థెరిసా సేవలు ఎనలేనివి

అంబాజీపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎందరో అనాధలను అక్కున చేర్చుకున్న మదర్ థెరిసా సేవలు ఎనలేనివని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేటలో మదర్‌థెరిసా జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

సెంటర్ సెక్యూరిటీ స్టడీస్‌తో బీవీసీఈ ఒప్పందం

అల్లవరం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల హైదరాబాద్ సెంటర్‌ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్‌తో అవగాహన ఒప్పందం కుదిరిందని సెక్రటరీ బోనం కనకయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్ తెలిపారు. ఈఒప్పందం ద్వారాఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాక్టికల్ శిక్షణ, లైవ్ ప్రాజెక్టులకు అవకాశాలు లభిస్తాయన్నారు. బీవీసీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏడీ డాక్టర్ రమేష్ కన్నెగంటి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలు, సాఫ్ట్‌స్కిల్స్ మెరుగుదలకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రాజశేఖర్, బీవీసీ అన్నివిభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల విద్యుదీకరణలో జాగ్రత్తలు పాటించండి



మలికిపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా మండపాలకు విద్యుత్ అమర్చుకునేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించాలని ఎలక్ట్రికల్ ఎస్ఈ బి.రాజేశ్వరిదేవి సూచించారు. లైసెన్స్‌గల ఎలక్ట్రీషియన్లతో పనులు చేయించాలన్నారు. నిర్వాహకులు విద్యుత్ అధికారుల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఐఎస్ఐ మార్కు ఉన్న వైర్లు, ఫిట్టింగ్స్‌ను వాడాలన్నారు. దెబ్బతిన్న, జాయింట్లు ఉన్న వైర్లు వాడవద్దన్నారు. మండపాలకు పది అడుగుల దూరంలో ప్యానల్ బోర్డులు అమర్చుకోవాలన్నారు. టెంట్లను విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు కట్టవద్దన్నారు.

అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు: సీఐ

అంబాజీపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చవితి పందిళ్ల వద్ద అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు హెచ్చరించారు. అంబాజీపేట పెద్దవీధిలోని ఉన్న ఏవీఎస్ కల్యాణ మండపంలో గణపతి నవరాత్రి ఉత్సవ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీజేలకు అనుమతి లేదన్నారు. సమావేశంలో ఎస్ఐ చిరంజీవి, ఎంపీడీవో నరసింహం, వీఆర్వోలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సొసైటీల కంప్యూటరైజేషన్ పూర్తి

కాట్రేనికోన, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ నూరు శాతం పూర్తయిందని కాట్రేనికోన డీసీసీబీ మేనేజర్ పీతల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కందికుప్ప సొసైటీలో చైర్మన్ నూకల మూర్తి అధ్యక్షతన కంప్యూటరైజేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక సొసైటీ కార్యక్రమాలు ఆన్‌లైన్‌లో జరుగుతాయన్నారు. సంఘ సభ్యులు మరణిస్తే అంత్యక్రియల ఖర్చుగా రూ.5వేలు అందించాలని రైతులు కోరారు. చైర్మన్ ఆధ్వర్యంలో మేనేజర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పేర్నీడి జయశ్రీ, సభ్యులు కాలాడి వీరబాబు, బొంతు శివశంకర్, సీఈవో యర్రంశెట్టి రామచంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి

అమలాపురం టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మోరంపూడి శ్రీచైతన్య పాఠశాలలో ర్యాగింగ్‌కు గురైన పదో తరగతి విద్యార్థి గుర్రం విన్సెంట్ ప్రసాద్‌కు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విన్సెంట్‌ప్రసాద్‌ను పలువురు మంగళవారం పరామర్శించారు.నాయకులు సీహెచ్ సూర్యప్రకాశరావు, పీతల రామచంద్రరావు, తాడి శ్రీరామమూర్తి, బుంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

2న రక్తదాన శిబిరం

పి.గన్నవరం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధిగ్రస్త బాలబాలికల రక్తం కోసం పి.గన్నవరంలో సెప్టెంబరు 2న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. జనసేన క్యాంపు కార్యాలయంలో కో-ఆపరేటివ్ బ్లడ్ డోనర్స్ అండ్ వలంటరీ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

యూరియా వినియోగంపై నిఘా

కాట్రేనికోన, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆధ్వర్యంలో మంగళవారం పల్లంకుర్రు, కాట్రేనికోనల్లో యూరియా వినియోగం, విక్రయాలకు సంబంధించి ఆకస్మిక తనిఖీ జరిగింది. కాట్రేనికోన వెంకటసుబ్రహ్మణ్య ట్రేడర్స్‌లో ఎరువుల నిల్వ, విక్రయం అంశాలపై తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ తాతారావు, డీసీటీవో ఎం.నవీన్‌కుమార్, వ్యవసాయాధికారి బి.మృదుల పాల్గొన్నారు.

ఇండియాస్ స్కిల్ కాంపిటేషన్స్

ముమ్మిడివరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు 2025కు సంబంధించి ఇండియాస్ స్కిల్ కాంపిటేషన్స్ 63 స్కిల్ ట్రేడ్స్‌లో నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. దీనికి సంబంధించి ఏపీ నైపుణ్యం పోర్టల్‌లో సెప్టెంబరు 30లోపుగా అభ్యర్థులు పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గోడపత్రికను కలెక్టర్ మహేష్‌కుమార్ ఆవిష్కరించినట్టు హరిశేషు తెలిపారు. ఏడీ ఎస్డీవో నాగబాబు, పీవోరాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో మాధవ్ పూజలు



ముమ్మిడివరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం ప్రత్యేక పూజలు జరిపించారు. మాధవ్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈసందర్భంగా బాలయోగీశ్వరుల కుటుంబ సభ్యులు, ఆశ్రమ కమిటీవారు ఆయనకు బాలయోగీశ్వరుల జీవిత చరిత్ర పుస్తకాన్ని అందించి సత్కరించారు. బాలయోగీశ్వరుల విశిష్టతను, చరిత్రలను వివరించారు. నల్లా పవన్‌కుమార్, అయ్యాజీవేమా, బాలయోగీశ్వరుల కుటుంబ సభ్యులు కటికదల చినసుబ్బారావు, బాలవివేకానంద పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ

మామిడికుదురు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ ఏర్పడిందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. లూటకుర్రులోని కడలి వెంకటరత్నం ఇంటి నుంచి ఎన్టీఆర్ కాలనీ వరకు రూ.50లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మంగళవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అధ్వానంగా ఉన్న రోడ్లన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పరుస్తున్నట్టు తెలిపారు. వరదల సీజన్ అనంతరం అప్పనపల్లి కాజ్‌వేపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల తాతకాపు, మాజీ జడ్పీచైర్మన్ నామన రాంబాబు, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, బోనం బాబు, కెఎం రజా, కడలి నూకరాజు, చుట్టుగుళ్ల కిశోర్, మద్దాల తమ్మన్న, కోట బ్రహ్మానందం, నాయకులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

మామిడికుదురు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2020లో పదో తరగతి చదివిన తమ విద్యార్థి గుమ్మళ్ల దుర్గాప్రసాద్ రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు తెలిపారు. విద్యార్థి, అతని మాతృమూర్తిని దుశ్శాలువాలు సన్మానించారు. డి.సత్యనారాయణ, బీహెచ్ మనోహర్‌రాజు, చొప్పల గోపి పాల్గొన్నారు.

గ్యాస్ లీక్‌పై ఎమ్మెల్యే గొల్లపల్లి పరిశీలన

యానాం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): సముద్రం నుంచి యానాంలోని ఐలాండ్ నెంబరు 3మీదుగా వెళ్లిన గ్యాస్ పైప్‌లైన్ లీక్‌కు సంబంధించి జరిగిన ప్రమాద సంఘటన ప్రాంతాన్ని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరిశీలించారు. మంగళవారం పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ చింతా కోదండరామ్, డీటీ జ్యోతివెంకటేశ్వరరావు తదితరులతో కలిసి బోట్‌లో సంఘటన ప్రాంతానికి వెళ్లారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. రెండు సంస్థలతో యానానికి ముప్పు ఉందన్నారు. ప్రజలు ప్రమాదం అంచున బతుకుతున్నారని, యవతకు ఉద్యోగావకాశాలు కూడా కల్పించలేదన్నారు.యానాంలోని అన్నిప్రాంతాల ప్రజలకు న్యాయం జరిగేలా కృషిచేస్తానని, నిత్యం ఆ ప్రాంతంలో నిఘా పెట్టాలన్నారు.

రాజోలు ఏపీపీగా శ్రీనివాస్



రాజోలు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాజోలు అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రముఖ న్యాయవాది ఆచంట శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయని తెలిపారు. గతంలో 2015-2020లో రాజోలు కోర్టు ఏపీపీగా పనిచేశారు. రెండోసారి ఏపీపీగా నియమితులైన శ్రీనివాస్‌కు రాజోలు బార్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరుపుల పంపిణీ

అంతర్వేది, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మూడు తూములు వద్దనున్న కేకేఎస్ఎంఆర్ అనాథశ్రమంలో మదర్‌థెరిసా పుట్టినరోజును పురస్కరించుకుని మలికిపురం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు, పండ్లు పంపిణీ చేసి పరుపులను అందజేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు గెద్దం ఫిలిప్‌రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రోటరీ క్లబ్‌చేసిన పలు సేవా కార్యక్రమాల గురించి పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సెక్రటరీ బందెల సంపత్‌కుమార్, రొటేరియన్ గెద్దం పేర్రాజు, తులసీబాస్కర్, జేసురత్నం, కాట్రు నతానియేలు, కిమ్నాథన్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ముమ్మిడివరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ సోమివారిదేవరపాలేనికి చెందిన సాధనాల చిట్టిబాబు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా అయినాపురం రోడ్డులో లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన చిట్టిబాబును స్థానికులు అంబులెన్సులో అమలాపురం ఆసుపత్రికి తరలించారు.

ఇస్మాయిల్‌కు సన్మానం

రాజోలు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మదర్‌థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ ఇటీవల రాజోలుకు చెందిన కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్‌కు జాతీయ మదర్ థెరిసా అవార్డును ప్రదానం చేసింది. అవార్డు అందుకున్న ఇస్మాయిల్‌ను మంగళవారం రాజోలులో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, టీడీపీ సీనియర్ నాయకుడు జగడం సత్యనారాయణ సన్మానించారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం, పి.గన్నవరం గ్రామం, బాలయోగి కాలనీ చెందిన ఉప్పు లక్ష్మి W/o తాతయ్య గారికి సంబంధించిన పాస్‌పోర్ట్ నెం.K 9432448 గల ఒరిజినల్ పాస్‌పోర్టును జిరాక్స్ నిమిత్తం ఇంటి దగ్గర నుండి పి.గన్నవరం సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

ఉప్పు లక్ష్మి, W/o తాతయ్య
డో.నెం.7-78/6, పి.గన్నవరం
సెల్: 9848774552

పాస్‌పోర్ట్ పడిపోయినది

డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం, రామరాజులంక గ్రామ కాపురస్తులైన నల్లి సువర్ణరాజు S/o నల్లి ప్రభాకరరావు అను నేను ది.16-8-2025వ తేదిన ఇంటి దగ్గర నుండి మలికిపురం సెంటర్‌కు నా పాస్‌పోర్ట్ నెం.C6476159 ను జిరాక్స్ తీయించుటకు వెళ్ళినప్పుడు మార్గ మధ్యలో జారిపడిపోయినది. దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

నల్లి సువర్ణరాజు S/o ప్రభాకరరావు
రామరాజులంక సెల్: 95055 98871

వినాయక చవితి శుభాకాంక్షలు



మట్టి వినాయకుడిని పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం...
మిత్రులకు, శ్రేయోభిలాషులకు, అధికారులకు వినాయకచవితి శుభాకాంక్షలు...
రాజోలు తాలూకా గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటి
35వ సం॥ అధ్యక్షులు: కాసు శ్రీనివాస్
సహకార్యదర్శి: రాజా నాగరత్నకుమార్
కార్యవర్గసభ్యులు: కొప్పిశెట్టి దుర్గబాబు



వాడపల్లిలో అన్నదాన భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

వకుళమాత అన్నదాన భవనం పనుల పరిశీలన

ఆత్రేయపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణ పనులను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, దేవదాయ శాఖ డీఈ ఉదయకుమార్ పరిశీలించారు. మంగళవారం అన్నదాన భవన నిర్మాణ పనులను వారు పరిశీలించి కాంట్రాక్టర్‌కు తగు సూచనలు చేశారు. అనంతరం ఆలయంలో ఉత్తర, దక్షిత ద్వారాల వెడల్పు పనులతో పాటు క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు. అన్నదాన భవనంలో బాయిలర్లు, వాటి ఏర్పాటు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ర్యాలిలో హోరెత్తిన వేదసభ

ఆత్రేయపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి సమయమంతుల, మాతంశెట్టి అన్నదాన సత్రంలో మంగళవారం వేదసభ నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి బీహెచ్‌వీ రమణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో అధిక సంఖ్యలో వేదపండితులు పాల్గొన్నారు. చతుర్వేదాలు పఠించగా, వేదఘోషతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం వేద ఆశీర్వచనం అందించారు.



ర్యాలిలో వేదసభ నిర్వహిస్తున్న దృశ్యం



దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తొలగించిన దివ్యాంగ పింఛన్లు కొనసాగించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తొలగించిన దివ్యాంగ పింఛన్లను కొనసాగించాలని దివ్యాంగుల హక్కుల వేదిక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు డిమాండు చేశారు. మంగళవారం రామచంద్రపురంలో దివ్యాంగుల సంఘాల సమావేశం జరిగింది. దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ మాట్లాడుతూ పుట్టుకతో వైకల్యంతో బాధపడుతున్న వారి వైకల్యశాతం తగ్గించడం దారుణం అన్నారు. దివ్యాంగుల వైకల్యశాతం యథావిధిగా ఉంచి పింఛన్లు కొనసాగించాలని కోరుతూ ఈనెల 28న రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొనాలని వక్తలు పిలుపునిచ్చారు.



కోట ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీవైఈవో రామకృష్ణమూర్తి

అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల తనిఖీ

కె.గంగవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో యూపీ నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయిన కోట, భట్లపాలిక ఉన్నత పాఠశాలలను మంగళవారం రామచంద్రపురం డీవైఈవో పి.రామకృష్ణమూర్తి తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, రికార్డులు, మధ్యాహ్న భోజనం రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.



గంగవరంలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

స్మార్ట్‌మీటర్ల అమలు రద్దు చేయాలని ధర్నా

కె.గంగవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం గంగవరంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమ శంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బి.సిద్ధూ తదితరులు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల అమలు తక్షణమే రద్దు చేయాలన్నారు. ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ భారాన్ని మోపవద్దని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చింతా రాజారెడ్డి, కరుపోతు నవీన్, జనపల్లి ప్రసాద్, రావి వెంకట్రావు, అనుసూరి సత్యనారాయణ, ఖండవల్లి శ్రీనివాస్, కాశి లెనిన్ బాబు, చెల్లె ధనలక్ష్మి, రావి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ఇప్పనపాడులో గణేష్ మందిర ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్

వినాయక మండపాల పరిశీలన

మండపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) వినాయక చవితిని భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ అన్నారు. ఇప్పనపాడు గ్రామంలో బుధవారం వినాయక చవితి పందిళ్లను ఆయన పరిశీంచారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విగ్రహాలు ఏర్పాటు చేయటంతోపాటు నిబంధనలు పాటించాలని అన్నారు. మండపాల వద్ద ప్లాస్టిక్ వస్తువులు, లౌడ్‌స్పీకర్లు వాడవద్దని సూచించారు. గణేష్ నిమజ్జనం సమయంలో పోలీసు సిబ్బందికి నిర్వాహకులు సహకరించాలన్నారు. వినాయక మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట రూరల్ సీఐ దొర్రాజు, ఎస్.ఐ తధితరులు పాల్గొన్నారు.

వర్షం దెబ్బకు మార్కెట్లు వెలవెల

మండపేట, ఆగస్టు, 26 (ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయం నుంచి పడుతున్న వర్షానికి వ్యాపారులను తీవ్రంగా దెబ్బతీసింది. బుధవారం జరిగే వినాయక చవితికి అవసరమయ్యే సామగ్రిని పలువురు వ్యాపారులు సిద్ధం చేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రజలు రాకపోవటంతో మండపేట పట్టణంలోని కేపీరోడ్డు కళ తప్పింది. చామంతి పూలు మినహా మరే ఇతర సామగ్రి ధరలు కూడా పెద్దగా పెరగలేదు. వర్షం దెబ్బకు వ్యాపారం జరగక పోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని పలువురు వ్యాపారులు వాపోయారు.



మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

ద్వారపూడిలో మదర్‌థెరిసా జయంతి

మండపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో మదర్‌థెరిసా జయంతిని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వున్న మదర్‌థెరిసా విగ్రహానికి వైద్యుడు పి.జగదీష్ జాన్ వెస్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుంకర నాని, కంకటాల మురళీకృష్ణ, చింతా శ్రీను, పల్లా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న దంత వైద్యుడు క్రాంతి కుమార్



రావులపాలెంలో వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యానందం, పార్టీ నాయకులు



కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేసిన వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం

మట్టి వినాయకుడినే పూజిద్దాం

• విగ్రహాల పంపిణీలో వక్తలు • వినాయక మండపాల వద్ద యువత సందడి • ముస్తాబైన ఆలయాలు

కె.గంగవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వక్తలన్నారు. వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని మట్టితో చేసిన విగ్రహాలను ఉపయోగించాలని ప్రముఖ దంత వైద్యుడు బి.క్రాంతి కుమార్ అన్నారు. మంగళవారం కె.గంగవరం ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ విభాగం, క్రాంతికుమార్ సంయుక్త ఆధ్వర్యంలో 1500 మట్టి వినాయక విగ్రహాలను గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శివన్నారాయణ, ఎంఈవో ఏ.నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు పి. వెంకటేశ్వరరావు, సైన్స్ జిల్లా అధికారి జీవీ సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు చిర్రా రాజ్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడదామంటూ వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. వినాయక చవితిని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో మట్టి ప్రతిమలను తయారు చేశారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ కేపీ రాజు ప్రారంభించి ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టీసీహెచ్ పాపారావు, డాక్టర్ జి.శ్రీనివాసులు, డాక్టర్ కె.అంకంరావు, సీహెచ్ నాగారాణి తదితరులు పాల్గొన్నారు.

పండుగలకు ప్రభుత్వం పెద్దపీట

టీడీపీ అధికార ప్రతినిధి బాబ్జి

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, దసరా మండపాలకు ఉచిత విద్యుత్ కోసం రూ.25 కోట్లు కేటాయించి పండుగలకు, సంప్రదాయాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి పేర్కొన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ ప్రభుత్వం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

రాయవరం, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ నిర్వహించారు. రాయవరం సాయితేజా విద్యానికేతన్ అకడమిక్ డైరెక్టర్ కర్రి భానురేఖా సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి వినాయకుడి విగ్రహాలను తహసీల్దారు ఐపీ శెట్టి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబులకు అందజేశారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పలు దుకాణాలకు పంపిణీ చేశారు. సోమేశ్వరం జనసేన ఆధ్వర్యంలో జరిగిన ఆపార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శాకా నాగేంద్ర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడి విగ్రహాలను వినియోగించాలన్నారు. మాచవరం గ్రామంలో రెడ్డి మహాజన సంఘం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దింశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ పాల్గొని వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్రి కృష్ణారెడ్డి, అయినవిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. రావులపాడు జడ్పీ పాఠశాలలో విద్యార్థులు చేసిన మట్టి వినాయక ప్రతిమలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.మధుసూదనరావు, కేవీ శేఖర్, పీవీ గిరి, సునీత, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

రింగ్ రోడ్డులో చవితి సందడి: రావులపాలెం రింగ్ రోడ్డులో వినాయకుడి పూజా సామగ్రి విక్రయాలతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. వాటి కొనుగోలుకు ప్రజలు పెద్దఎత్తు తరలిరావడంతో రింగ్ రోడ్డు ప్రాంతమంతా సందడి నెలకొంది.





రాయవరంలో తహసీల్దారుకు మట్టి వినాయక విగ్రహాన్ని అందజేస్తున్న సాయితేజా విద్యార్థులు. పక్క చిత్రంలో కపిలేశ్వరపురంలో వినాయక విగ్రహాలను విక్రయిస్తున్న దృశ్యం

మట్టి ప్రతిమల పంపిణీ

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. చిత్రలేఖన ఉపాధ్యాయుడు రాయుడు త్రినాద్ ప్రసాద్ విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయించారు. హెచ్ఎం ఉప్పలపాటి మాచిరాజు ఆధ్వర్యంలో మట్టి గణపతిని పూజిద్దాం...పర్యావరణాన్ని కాపాడుదాం నినాదంతో 9వ తరగతి విద్యార్థి హరీష్ గణపతి వేషధారణ వేయించి విద్యార్థులు, పాఠశాల పరిసర వాసులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.

సుద్దముక్కలతో వినాయకుడు: రామచంద్రపురం మండలం హసన్‌బాద జడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయుడు జి.శ్రీను సుద్దముక్కలతో వినాయకుని ప్రతిమను తీర్చిదిద్దారు. రెండు సుద్దమ్ముకలను తీసుకుని వినాయకుడి ముఖం తయారు చేశారు. రెండవ సుద్దముక్కతో చెవులు, కలువ రేఖలు తయారు చేసి అతికించారు. తదుపరి సుద్దముక్కలు విరిగిపోకుండా ఫెవిక్విక్ పూశారు. ఆయన సూచనతో జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు కాళా హర్షవర్ధన్, వాసంశెట్టి ప్రవీణ్‌కుమార్ రావిఆకుపై వినాయక రూపాన్ని తీర్చిదిద్దారు.

ధరల పెరుగుదలతో ప్రజల బెంబేల్

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, టేకి, కోరుమిల్లి, కాలేరు, వల్లూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలు ధరల పెరుగులతో వెలవెల బోతున్నాయి. ఏదైనా వస్తువు కొనుగోలు చేయాలంటే సామాన్యులు భయపడుతున్నారు. పాలవల్లికి కట్టే వెలగ, దానిమ్మ, మొక్కజొన్న, యాపిల్ తదితర కాయలు ధర రూ.50 కంటే ఎక్కువ పలకడంతో కొనేందుకు ముందుకు రావడంలేదు. దీంతో సామగ్రి అమ్ముడుకాక నష్టపోతున్నామని ఆయా దుకాణదారులు వాపోతున్నారు.

సిద్దార్థలో ఆకట్టుకున్న వేషధారణలు

అలమూరు, (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని అలమూరు శ్రీసిద్దార్థ హైస్కూల్‌లో మంగళవారం చిన్నారులు సందడి చేశారు. స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ముందుగా వినాయక పూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టిగణపయ్యలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. విద్యార్థుల సంప్రదాయ దుస్తులతోపాటు వివిధ దేవతా మూర్తుల వేషదారణలతో వారు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వలస కార్మికులకు ప్రతిమల పంపిణీ

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ఆయా స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక ప్రతిమలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు...మట్టి వినాయకుడు ముద్దు అంటూ ప్రజలకు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మంగళవారం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులకు మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. అంకంపాలెం, ర్యాలి, నార్కెడిమిల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న వలస కార్మికులకు అనూష్ సంస్థ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు.



ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం



రామచంద్రపురంలో వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం



రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఎం కుమార్, ఉద్యోగులు

ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మొక్కల పెంపకం

రావులపాలెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలు పెంచుతున్నట్లు డిపో మేనేజర్ వైవీఎస్ కుమార్ తెలిపారు. రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణతో పాటు, సైకిల్ స్టాండ్ సమీపంలో డీఎం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

ఘనంగా మదర్‌థెరీసా జయంతి



కొత్తపేట పంచాయతీ ఆవరణలో మదర్‌థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అలమూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మదర్‌థెరీసా జయంతిని పురస్కరించుకుని సంధిపూడి మదర్‌థెరీసా విగ్రహం వద్ద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరపురెడ్డి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మదర్‌థెరీసా విగ్రహానికి నివాళులర్పించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మదర్‌థెరీసా జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటాలకు పలువురు నివాళులర్పించారు.

ఆదర్శంగా తీసుకోవాలి

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మదర్ థెరిసా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం రాయవరం సంజయ్ గాంధీ వృద్ధాశ్రమంలో మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిసా చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం వృద్ధాశ్రమంలో 40 మంది వృద్ధులకు పండ్లు, రొట్టెలు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు ఎస్.కృష్ణకుమారి, పి.సుబ్బరాజు, లచ్చిరెడ్డి వెంకటరమణ, నాగిరెడ్డి, ఎన్.దుర్గా ప్రసాద్, ఎస్. తులసి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక విద్యా బాలమందిర్‌లో మదర్‌థెరిసా జయంతిని నిర్వహించారు. పంచాయతీ ఆవరణ మదర్‌థెరిసా విగ్రహానికి సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్ మదర్‌థెరిసా విగ్రహానికి నివాళులర్పించారు. పేదల సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి మదర్‌థెరిసా అని కొనియాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.అనురాధ, నూకపెయ్యి శివరత్నం, అధ్యాపకులు టి.రమాదేవి, నాగారాణి తదితరులు పాల్గొన్నారు.

28న తెలుగుభాషా దినోత్సవం



అలమూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని 28న సంధిపూడిలో బాలమందిరం అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు వ్యవస్థాపకుడు కృష్ణశ్రీ తెలిపారు. సంధిపూడి జడ్పీ హైస్కూల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో జూనియర్స్, సీనియర్ విభాగాల్లో కథారచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు ఆయన వివరించారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే తెలుగు బాషా దినోత్సవ సభకు పలువురు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలుగు బాషాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



మట్టి వినాయకుడినే-పూజిద్దాం...
పర్యావరణాన్ని కాపాడుదాం...
మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
అధికారులకు
వినాయకచవితి శుభాకాంక్షలు...
రాజోలు తాలూకా గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటి
35వ సం॥ అధ్యక్షులు: కాసు శ్రీనివాస్
సహకార్యదర్శి: రాజా నాగరత్నకుమార్
కార్యవర్గసభ్యులు: కొప్పిశెట్టి దుర్గబాబు

పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ



రాయవరం మోడల్ ప్రాథమిక పాఠశాలకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు బహూకరిస్తున్న దృశ్యం

రాయవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాయవరం రాజరాజేశ్వరి కాలనీ మోడల్ ప్రాథమిక పాఠశాలకు దాత సహకారంతో మంగళవారం ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు బహూకరించారు. గ్రామానికి చెందిన నూలు సత్యనారాయణ వితరణతో నాలుగు ఫ్యాన్లు, రెండు ట్యూబ్ లైట్లు బహూకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లచ్చిరెడ్డి వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



నర్సిపూడి గ్రామ ప్రజానీకానికి,
మా ఎమ్మెల్యే
శ్రీ బండారు సత్యానందరావు గారికి,
కూటమి నాయకులకు, కార్యకర్తలకు,
అధికారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
వినాయక చవితి శుభాకాంక్షలతో...
శ్రీ బండారు సత్యానందరావు గారు
ఎమ్మెల్యే, కొత్తపేట నియోజకవర్గం
మీ... రాయుడు వెంకటస్వామి (బాబ్జి)



PACS అధ్యక్షులు,
గ్రామ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు,
నర్సిపూడి గ్రామం, ఆలమూరు మండలం